మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 02 సంచిక 101 | ఆదివారం 29 మార్చి 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-


## నేటి మాట


విశ్రాంతిగా కూర్చుని క్రమక్రమంగా అభివృద్ధి చెందుతాములే అని వేచిచూడకూడదు. వెంటనే ప్రారంభించాలి



-స్వామి వివేకానంద

## ఆలయంలో ప్రీ వెడ్డింగ్ షూట్ వివాదం

బూట్లు వేసుకుని వచ్చారనే ఆరోపణలు
ఫోటోగ్రాఫర్లతో వాగ్వాదంఘర్షణ
హింసాత్మకంగా మారింది
కెమెరాలు ధ్వంసం, ఇద్దరికి గాయాలు
వైరల్ అయిన దాడి వీడియో



2 లో

## లోన్ యాప్ వేధింపులు.. ఎంబిఏ విద్యార్థి సూసైడ్

నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి
అత్యాచారం
ఆస్పత్రి వద్ద పరిచయం
పోలీసులకు ఫిర్యాదు నమోదు
సీసీటీవీ ఫుటేజీల పరిశీలన
నిందితుడి కోసం గాలింపు చర్యలు



2 లో

## కొత్త పార్టీపై రాజకీయ చర్చ టీపీసీసీ చీఫ్ స్పందన

ప్రజల మద్దతే కీలకం
కవిత పార్టీకి స్వాగతం
కాంగ్రెస్‌కు నష్టం లేదని ధీమా
ప్రజల నమ్మకమే పార్టీ భవిష్యత్తు



2 లో

## ఉస్మానియా పేరుతో కల్తీ బిస్కెట్లు..

### ప్రజల ప్రాణాలతో చెలగాటం

నిషేధిత రసాయనాల వినియోగం
పాడైన గుడ్లతో తయారీ
మురికి వాతావరణంలో ఉత్పత్తి
ఆకస్మిక దాడుల్లో బయటపడ్డ నిజాలు
కేసు నమోదు, కఠిన చర్యలు



2 లో

# మూసీ ప్రక్షాళన అనివార్యం

### సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): మూసీ ప్రక్షాళన అనివార్యమని, లేకపోతే హైదరాబాద్ మహానగరం మరో ఢిల్లీలా మారే ప్రమాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ మంచిరేవులలో ఆయన ఓంకారేశ్వర ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం భగవత్ కార్యంగా భావిస్తున్నానని అన్నారు. ముచుకుంద నదికి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. గతంలో గోదావరి, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకోలేకపోయామని, ఇప్పుడు ఆ జలాలను ఉపయోగించుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**మత సామరస్యానికి మూసీ వేదిక..**

ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ కాలుష్య నగరంగా మారకూడదని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. మూసీ ప్రక్షాళన ఇప్పుడు చేసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తప్పవని తెలిపారు. నదులు కాలుష్యం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక మత సామరస్యానికి మూసీ వేదిక కానుందని పేర్కొంటూ.. ఉప్పల్–నాగోల్ ప్రాంతంలో అద్భుతమైన చర్చి, పురానాపూల్‌లో



2 లో

మసీదు నిర్మిస్తామని వెల్లడించారు. అద్భుతమైన పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మూసీని తీర్చిదిద్దుతామని, గోదావరి జలాలను మూసీకి తరలించి నిత్యం జల ప్రవాహం ఉండేలా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## అసెంబ్లీలో శివుని చిత్రపటంతో

### మంత్రి పొన్నం.. ప్రతిపక్షం అభ్యంతరం



2 లో

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): తెలంగాణ అసెంబ్లీలో శనివారం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా సభలో మంత్రి శివపార్వతులు వారిద్దరి కుమారులకు సంబంధించిన చిత్రపటాన్ని మంత్రి సభలో ప్రదర్శించారు. దీంతో రూల్స్ ప్రకారం సభలో ఫోటోలు చూయించవద్దు కదా అని ప్రతిపక్ష సభ్యులు అడ్డు చెప్పడంతో తాను అనుమతి తీసుకున్నానని చెప్పారు.

## హర్మూజ్ జలసంధిలో తగ్గని ఉద్రిక్తతలు

### రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు రెట్టింపు



2 లో

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి లో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా భారత్ తన వ్యూహాన్ని మార్చింది. అమెరికా–ఇరాన్ యుద్ధం కారణంగా చమురు సరఫరాకు ఆటంకాలు కలగడంతో భారత్ మళ్లీ రష్యా వైపు మొగ్గు చూపుతోంది.జనవరి నెలతో పోలిస్తే రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు ఏకంగా రెట్టింపు అయ్యే అవకాశం ఉందని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

# రాజధాని చట్టబద్ధత తీర్మానం ప్రవేశపెట్టిన సీఎం చంద్రబాబు

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధతపై తీర్మానం చేసేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ప్రారంభమయింది. దీనిపై సభలో సుమారు 4 గంటలపాటు సుదీర్ఘ చర్చ జరగనుంది. అమరావతికి చట్టబద్ధత తీర్మానం చేసి.. ఆ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత హైదరాబాద్ ను పదేళ్లపాటు ఉమ్మడిరాజధానిగా చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి రాజధాని గడువు 2024 జూన్ 2 తోనే ముగిసింది. కానీ.. ఇంతవరకూ రాష్ట్ర రాజధానికి చట్టబద్ధత రాలేదు. దీంతో రాష్ట్ర రాజధానికి చట్టబద్ధత తీసుకొచ్చే దిశగా ఏపీ సర్కార్ అడుగులు వేస్తోంది.

**మళ్లీ ఆ తప్పు జరగకూడదు**

ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ఐదున్నరకోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్షకు ఈ సభ ప్రతిరూపమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతికి ఎదురయ్యే సవాళ్లను శాశ్వతంగా తొలగించే యజ్ఞమని, ఈ పవిత్ర యజ్ఞంలో భాగస్వామ్యమయ్యే భాగ్యం మనందరికీ లభించిందన్నారు. 2014లోనే రాష్ట్రాన్ని తీరం చేర్చే బాధ్యతను ప్రజలు చంద్రబాబుకు అప్పగించారని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం అమరావతిని పక్కనపెట్టి మూడు రాజధానులంటూ అయోమయానికి గురిచేసిందని గుర్తుచేశారు. దీనివల్ల భూములిచ్చిన రైతులతో పాటు రాష్ట్రం కూడా తీవ్రంగా నష్టపోయిందని, మళ్లీ అలాంటి తప్పు జరగకూడదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు



పేర్కొన్నారు. అమరావతిని రాజధానిగా 2014లోనే అన్ని పార్టీలు అంగీకరించినా.. గత ప్రభుత్వం క్రియేట్ చేసిన అయోమయంలో ఇప్పటివరకూ రాజధానికి చట్టబద్ధత లేకుండా, రాకుండా ఆగిపోయిందన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో అమరావతికి చట్టబద్ధత తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

# విప్‌లపై సీఎం రేవంత్ ఫైర్

### ‘ఆరుగురు ఉన్నా నో యూజ్’ అని అసహనం!

- సమన్వయంలో విఫలం అన్న విమర్శ
- విపక్షాలకు కౌంటర్ ఇవ్వలేకపోవడం
- స్ట్రాటజీ మీటింగ్‌లకు గైర్హాజరు
- సభలో రూలింగ్ పార్టీ పేలవ ప్రదర్శన
- సభ్యుల హాజరుపై నిర్లక్ష్యం
- సీఎం ఉన్నప్పుడే యాక్టివ్
- మంత్రుల పనితీరుపై విమర్శలు



మిగతాది 2 లో..

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): అసెంబ్లీలో విప్‌ల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. మంత్రులు, సభ్యుల మధ్య సమన్వయం సాధించడంలో విఫలమవుతున్నట్లు అసహనం వ్యక్తం చేశారని సమాచారం. విపక్షాల విమర్శలు, ఆరోపణలపై వెంటనే కౌంటర్ చేయడంలోనూ చొరవ చూపడం లేదని కామెంట్ చేసినట్లు తెలిసింది. ‘బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు అసెంబ్లీలో ఆరు గ్యారెంటీల మీద ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సమయంలో విప్‌లు ఎందుకు కౌంటర్ ఇవ్వలేకపోయారు. గతంలో బీఆర్ఎస్ దళితబంధు, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇస్తానని ఎన్నికల సమయంలో ప్రకటించింది. మరి పదేండ్ల పాలనలో ఎందుకు ఇవ్వలేకపోయారు’ అని విప్‌లు కౌంటర్ ఇవ్వలేకపోయారని సీఎం సీనియర్ లీడర్ల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. సభ ప్రారంభానికి ముందు సభా వ్యవహారాల మంత్రి, విప్‌లు సమావేశమై ఆ రోజు జరిగే కార్యక్రమాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించాలి. కానీ, శ్రీధర్ బాబు నిర్వహించే స్ట్రాటజీ మీటింగ్ కొందరు విప్‌లు మాత్రమే హాజరవుతున్నారనే విమర్శలున్నాయి. దీంతో సభలో రూలింగ్ పార్టీ సభ్యుల పనితీరు పేలవంగా ఉందని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

**చొరవచూపని విప్‌లు..**

ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాలకు ముందు అసెంబ్లీలో కేవలం ముగ్గురు విప్‌లు మాత్రమే ఉండగా ఈనెల 18న మరో ముగ్గురుని విప్‌లుగా నియమించారు. దీంతో ఆరుగురు విప్‌లతో సభలో రూలింగ్ పార్టీ పెర్ఫార్మెన్స్ గతంలో కంటే మెరుగ్గా ఉంటుందని అందరూ ఆశించారు. కానీ, వారం రోజులుగా సభలో విఫ్ ల పని తీరును గమనించిన తరువాత ‘ఆరుగురు విప్‌లు ఉన్నా ప్రయోజనం లేదు. ఎవరు ఏం చేస్తున్నారో తెలియదు. విపక్షాల విమర్శలకు వెంటనే కౌంటర్ చేయట్లేదు’ అని సీఎం రేవంత్ రెడ్డి కొందరు నాయకుల ముందు కామెంట్ చేసినట్లు తెలిసింది. సభ్యులు సమయానికి సభాకు వస్తున్నారా లేదా పట్టించుకోవడం లేదని, సభ జరుగుతున్న సమయంలో కొందరు సభ్యులు ఇన్నర్ లాబీ, మంత్రుల చాంబర్లలో ఎమ్మెల్యేలు పిచ్చాపాటిగా మాట్లాడుతున్నా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రధానంగా ఈ మధ్య బీజేపీ ఎమ్మెల్యే మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై కామెంట్ చేసిన సమయంలో విప్‌ల నుంచి ఆశించిన స్పందన రాలేదని చర్చ జరుగుతున్నది. ‘పాత ముగ్గురు విప్‌లలో కేవలం ఆది శ్రీనివాస్ మాత్రమే విపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని, మిగతా విప్‌లు ఎప్పుడూ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తిన సందర్భాలు లేవు’ అని ఓ సీనియర్ మంత్రి అభిప్రాయపడ్డారు.

## దేశానికే మరో మణిహారం

### నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును ప్రారంభించిన ప్రధాని మోడీ




2 లో

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): ఉత్తరప్రదేశ్ అభివృద్ధి పథంలో మరో చారిత్రాత్మక మైలురాయి ఆవిష్కృతమైంది. జేవర్ వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.

## కొత్త రూపం దాల్చిన బెట్టింగ్ దందా

### ఫామ్ హౌస్‌లు, ఆఫ్‌లైన్‌పై ప్రత్యేక నిఘా: సీపీ సజ్జనార్



2 లో

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



# కష్టకాలంలో దుష్ట రాజకీయాలు చేయొద్దు : ప్రధాని మోదీ

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో చమురు, ఇంధనం, ఎల్పీజీ సప్లై సరిగ్గా లేక దేశ ప్రజలు ఇప్పటికే ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుతానికి అవన్నీ సరిపడా నిల్వలున్నాయని, మరో 60 రోజులవరకూ ఏం ఢోకా లేదని కేంద్రం చెప్తోంది. ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్న వేళ.. విపక్షాలు దుష్ట రాజకీయాలు చేయొద్దని ప్రధాని నరేంద్రమోదీ విజ్ఞప్తి చేశారు. శనివారం నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత్ లో అభివృద్ధి ఆటంకం లేకుండా జరుగుతోందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో దేశ అభివృద్ధి కొనసాగుతుందన్నారు. అంతర్జాతీయంగా సంక్షోభం నెలకొన్నా.. భారత్ తలెత్తుకుని నిలబడిందన్నారు. వికసిత్ భారత్ కోసం మౌలిక వసతుల్ని ఆధునికీకరిస్తున్నామని ప్రధాని తెలిపారు. ఇప్పటి వరకూ దేశంలో మౌలిక వసతుల కోసం రూ.17 లక్షల కోట్లను ఖర్చుచేశామని వెల్లడించారు. దేశంలో ఉన్న రైల్వే లైన్లలో 40 వేల కిలోమీటర్ల మేర విద్యుదీకరణ చేశామని వివరించారు. అలాగే ఎన్డీయే హయాంలోపోర్టుల సంఖ్య రెండింతలు పెరిగిందన్నారు. వికసిత్ భారత్ కోసం ప్రతిఒక్కరూ ముందుకురావాలని ప్రధాని పిలుపునిచ్చారు.

శుక్రవారం జరిగిన ముఖ్యమంత్రులతో సమావేశంపై కూడా మోదీ స్పందించారు. ప్రస్తుతం ఉన్న సంక్షోభాన్ని అందరం కలిసి సమర్థవంతంగా ఎదుర్కొందామని సీఎంలను కోరినట్లు ప్రధాని చెప్పారు. ఇది దేశానికి కష్టకాలమని, ఈ సమయంలో విపక్షాలు దుష్ట రాజకీయాలు చేయొద్దని కోరారు. దేశానికి నష్టం కలిగించే పనులు చేయొద్దని కోరారు. అలాంటివి చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. ప్రస్తుతం దేశంలో సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని, సామాన్యులు, ప్రజలపై భారంగా లేకుండా చర్యలు చేపడుతున్నామని మోదీ తెలిపారు.

# విప్‌లపై సీఎం రేవంత్ ఫైర్

## ‘ఆరుగురు ఉన్నా నో యూజ్’ అని అసహనం!

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ ఉన్నప్పుడే సీరియస్..: అసెంబ్లీకి సీఎం రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు మాత్రమే విప్‌లు, సభ్యులు కాస్త హడావుడీ చేస్తుంటారని టాక్ ఉంది. సీఎం సభకు రాకపోతే మాత్రం ఎవరూ పెద్దగా పట్టించుకోరనే కామెంట్స్ ఉన్నాయి. సభలో మంత్రులు వ్యవహరిస్తున్న తీరుపై సైతం విమర్శలున్నాయి. సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, సీతక్క మినహా మిగతా మంత్రులు విపక్షాల విమర్శలు, ఆరోపణలకు కౌంటర్ ఇచ్చేందుకు అంతగా ఇంట్రస్ట్ చూపడం లేదనే కామెంట్స్ ఉన్నాయి. ‘తమ క్వశ్చన్‌కు సమాధానం చెప్పామా.. తమ శాఖకు సంబంధించిన పద్దుకు సభ ఆమోదం పొందిందా’ అనే తీరుగా మంత్రులు వ్యవహరిస్తున్నారే తప్ప సభా కార్యక్రమాలను సొంతం చేసుకోవడం లేదని విమర్శలు కాంగ్రెస్ వర్గాల్లో ఉన్నాయి.

# అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం




న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): శ్రీరామ నవమి సందర్భంగా అయోధ్యలో ఏర్పాటు చేసిన మహా యజ్ఞ శాలలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సరయూ నది తీరాన జమ్తారా ఘాట్ వద్ద నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనారాయణ మహాయజ్ఞంలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. యజ్ఞం ముగిసిన మరుసటి రోజే ఈ ఘటన జరగడం గమనార్హం. యజ్ఞశాలలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వెదురు, గడ్డి తో నిర్మించిన పండల్ క్షణాల్లో బూడిదయింది. ప్రమాద సమయంలో యూపీ రవాణా మంత్రి దయాశంకర్ సింగ్ సహా పలువురు ఉన్నతాధికారులు అక్కడే ఉన్నప్పటికీ, అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఆరు అగ్నిమాపక యంత్రాలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, యజ్ఞగుండంలోని నిప్పురవ్వలు ఎగిసి పడటం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

అయితే, ఈ ఘటనపై ప్రస్తుతం తీవ్ర స్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యజ్ఞ నిర్వహణలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదని, నిపుణుల పర్యవేక్షణ లేకుండానే ఇంతటి భారీ కార్యక్రమాన్ని నిర్వహించారని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా, యజ్ఞం పేరుతో మంత్రికి సంబంధించిన విభాగాన్ని ఉపయోగించుకుని నిధుల సేకరణ జరిగిందని, కేవలం ఖర్చు తగ్గించుకోవాలనే ఉద్దేశంతో భద్రతా ఏర్పాట్లను గాలికొదిలేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ భారీ కార్యక్రమం వెనుక ఉన్న ఆర్థిక వనరులు, మానవ వనరుల వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

# ఆపరేషన్ కగార్‌పై కేంద్రం కీలక నిర్ణయం

## ఎల్లుండి లోక్ సభలో అమిత్ షా సంచలన ప్రకటన?



న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్ దగ్గర పడింది. ఈ నెల 31 వరకు భారత్?ను మావోయిస్టు రహిత దేశంగా మార్చుతామంటూ ప్రకటించిన కేంద్రం.. ఈ ఆపరేషన్ ద్వారా మావోయిస్టు ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అయితే మూడు రోజుల్లో గడువు సమీపిస్తున్న వేళ ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల సంగతి ఏంటి? వారు లొంగిపోబోతున్నారా..? లేదా..? అనే సందేహాలు తలెత్తుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మావోయిజాన్ని తుడిచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై లోక్‌సభలో కీలక చర్చ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. రేపటికి లోక్‌సభలో ఈ అంశంపై స్వల్పకాలిక చర్చ జరపబోతున్నది. లోక్‌సభ కార్యకలాపాల నింబంధన 193 ప్రకారం స్వల్పకాలిక చర్చ నిర్వహించాలని లోక్‌సభ సభ్యులు శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే, బైరెడ్డి శబరి స్పీకర్‌కు నోటీసులు ఇచ్చారు. వీరి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న స్పీకర్ ఓం బిర్లా ఎల్లుండి చర్చ జరపనున్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో ఆపరేషన్ కగార్, మావోయిస్టు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయబోతోంది అనేది ఉత్కంఠగా మారింది.

గణపతి కోసం ఆఖరి ప్రయత్నం?: 2024 జనవరిలో ప్రారంభించిన ఆపరేషన్ కగార్ మావోయిస్టు పార్టీని పెద్ద ఎత్తున డ్యామేజ్ చేసింది. ఈ ఆపరేషన్ మొదలు పెట్టాక మునుపెన్నడూ లేని విధంగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో చనిపోగా పార్టీ ముఖ్యనేతలు చాలా మంది లొంగుబాట పట్టారు. ఈ క్రమంలో ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్ ముంచుకు వస్తుండటంతో ఇంకా మిగిలిన మావోయిస్టుల పరిస్థితి ఏంటి అనే చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు, పార్టీ కేంద్ర కమిటీలో మిగిలిన చురుకైన నేత మిసిర్ బెస్రాతో పాటు మిగిలి మావోయిస్టు కేడర్ సంగతి ఏంటనే డిస్కషన్ వస్తోంది. ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో గణపతి సరెండర్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ మేరకు ఆయన తెలంగాణ పోలీసులను సంప్రదిందిస్తున్నారని కేంద్ర ప్రభుత్వ వర్గాల ద్వారా సమాచారం అందినట్లు ప్రచారం జరుగుతోంది. ఎల్లుండి లోక్‌సభలో చర్చకు ముందే ఏ క్షణంలోనైనా ఆయన లొంగుబాటు ఖాయమని ప్రచారం జరుగుతోంది. మరోవైపు బెస్రా, ఆయన అనుచరుల కోసం కోబ్రా దళాలు జార్ఖండ్‌లోని సరండా అటవీ ప్రాతంలో 15 వేల మంది సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ జవాన్లు జల్లెడ పడుతున్నారు. అడవి చుట్టూ జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సైతం పెద్దఎత్తున గాలిస్తున్నాయి. దీంతో లోక్‌సభలో చర్చ జరిగేలోపు సరెండర్లు ఉండబోతున్నాయా లేక ఎన్‌కౌంటర్లు ఉంటాయా అనేది ఉత్కంఠగా మారింది.

# అసెంబ్లీలో శివుని చిత్రపటంతో మంత్రి పొన్నం.. ప్రతిపక్షం అభ్యంతరం

మొదటి పేజీ తరువాయి

శనివారం సభలో రవాణాశాఖ, బీసీ సంక్షేమ శాఖకు కేటాయింపులపై చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలు ఇస్తూ. ఇటీవల వేములవాడకు శృంగేరి పీఠాధిపతి వచ్చినప్పుడు అక్కడ శంకరుడి కుటుంబానికి సంబంధించిన చిత్ర పటాన్ని చూపిస్తూ అందులోని వైరుధ్యాలు ఉన్నా కలిసి ఉండాల్సిన విషయాలను వివరించారని చెప్పారు. శంకరుని పరివారానికి సంబంధించిన చిత్రపటంలో శంకరుని వాహనం నంది, పార్వతి వాహనం సింహం, కుమారస్వామి వాహనం నెమలి, వినాయకుడి వాహనం ఎలుక ఉంటాయి. వీటిలో ఒకదానికి మరొక దానితో పడదు. కానీ దైవభక్తి విషయంలో అన్ని కలిసే ఉంటున్నాయన్నారు.

కాగా గతంలో లోక్ సభలో ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సభలో శివుడి చిత్రపటాన్ని ప్రదర్శించడం కాంట్రవర్సీగా మారింది. దీన్ని స్పీకర్ ఓం బిర్లా ఖండించారు. సభలో ఎలాంటి ప్రకార్డులు లేదా గుర్తులు చూపించకూడదని చెప్పిన సంగతి తెలిసిందే.

# మూసీ ప్రక్షాళన అనివార్యం

## సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

మూసీతో ఉమ్మడి నల్లగొండ అల్లాడుతోంది..హైదరాబాద్ కాలుష్యమంతా మూసీలో కలుస్తోందని, దీనివల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఫ్లోరైడ్‌తో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, అందుకే మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని అన్నారు. కానీ, కొందరు రాజకీయ కారణాలతో పనులను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేస్తున్నారని, గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి అడ్డుకోవాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

# బోయిన్‌పల్లిలో అగ్నిప్రమాదం

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని బోయిన్‌పల్లి సెంటర్ పాయింట్ వద్ద ఉన్న ఓ కళ్లద్దాల దుకాణంలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి, దట్టమైన పొగలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పిందని అధికారులు తెలిపారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పొగలు దట్టంగా అలుముకోవడంతో కాసేపు స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# ఆలయంలో ప్రీ వెడ్డింగ్ షూట్ వివాదం

## వారిపై స్థానిక యువకుల దాడి.. ఏడుగురి అరెస్ట్

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): కర్ణాటకలోని సకలేశ్‌పుర సమీపంలో ఉన్న ప్రసిద్ధ ‘బెట్టద భైరవేశ్వర’ ఆలయంలో జరిగిన ఓ ప్రీ-వెడ్డింగ్ షూట్ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పవిత్రమైన గుడి ప్రాంగణంలోకి ఫొటోగ్రాఫర్లు బూట్లు వేసుకుని వచ్చారనే ఆరోపణలతో స్థానిక యువకులు వారిపై దాడికి దిగారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ ప్రాంగణంలో ఫొటోలు తీయడాన్ని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి తోడు ఫొటోగ్రాఫర్లు బూట్లు వేసుకుని వచ్చారనే ఆరోపణలతో వారితో వాగ్వాదానికి దిగారు. అయితే ఎవరూ బూట్లు ధరించలేదని ఫోటో గ్రాఫర్లు వాదనను తిప్పికొట్టారు. దీంతో ఈ ఘర్షణ కాస్త భౌతిక దాడికి దారితీసింది. యువకులు ఫొటోగ్రాఫర్లను తీవ్రంగా కొట్టడమే కాకుండా, వారి కెమెరాను ధ్వంసం చేసినట్లు తెలిసింది.

ఈ దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గాయపడిన నవి, నందన్ అనే ఇద్దరు ఫొటోగ్రాఫర్లను చికిత్స కోసం సకలేశ్‌పుర తాలూకా ఆసుపత్రికి తరలించారు. దీంతో సకలేశ్‌పుర రూరల్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దాడికి పాల్పడిన ఆశి, ప్రశాంత్, రక్ష, అరవింద్, ఉచిత్, ప్రజ్వల్, నిశాంత్ అనే ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.

# నగరంలో దారుణం యువతిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): విజయవాడ నగరంలో ఓ ఆటో డ్రైవర్ కామాంధుడిగా మారి ఒక యువతి జీవితాన్ని చిన్నాభిన్నం చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రికి సేవ చేసేందుకు వచ్చిన ఒక యువతిని నమ్మించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన ఘటన విజయవాడలో కలకలం రేపింది.

ఘటన వివరాల్లోకి వెళ్తే.. బాధితురాలి తండ్రి అనారోగ్య కారణాలతో విజయవాడలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తండ్రిని చూసుకునేందుకు సదరు యువతి ఆస్పత్రికి వచ్చింది. ఈ క్రమంలో అక్కడ పరిచయమైన ఒక ఆటో డ్రైవర్, ఆమెకు మాయమాటలు చెప్పి నమ్మించాడు. సహాయం చేస్తానని నమ్మబలికి, ఆమెను తన ఆటోలో ఎక్కించుకుని కృష్ణలంక ప్రాంతంలోని ఒక నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి.. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన దారుణంపై బాధితురాలు మాచవరం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు జిజిహెచ్ ఆస్పత్రి ఆవరణలోని, కృష్ణలంక పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. రిపోర్టులు రావలసి ఉన్నట్లు తెలుస్తోంది. పరారీలో ఉన్న ఆటో డ్రైవర్ కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఆస్పత్రుల వంటి రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరగడం పట్ల స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# లోన్ యాప్ వేధింపులు.. ఎంబిఏ విద్యార్థి సూసైడ్



న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): లోన్ యాప్ వేధింపులు భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన కాకినాడ జిల్లాలో చోటుచేసుకుంది. అనకాపల్లి జిల్లా వడ్డాది మాడుగుల గ్రామానికి చెందిన మహమ్మద్ బషీర్ (22) కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ప్రైవేట్ కాలేజీలో ఎంబీఏ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కొద్దిరోజుల క్రితం అతను ఒక లోన్ యాప్ లో అప్పు తీసుకున్నాడు. ఆ అప్పును తిరిగి చెల్లించకపోవడంతో.. షరా మామూలుగా యాప్ నిర్వాహకులు తీవ్రంగా వేధించారు. అప్పు తిరిగివ్వకపోతే ఫేక్ ఫొటోలు, మార్ఫ్ వీడియోలను వైరల్ చేస్తామని బెదిరించడంతో ఆ ఒత్తిడిని తట్టుకోలేక గదిలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. లోన్ యాప్ ఇచ్చే ఆఫర్లకు ఆకర్షితులై లోన్లు తీసుకోవద్దని పోలీసులు యువతను పదే పదే హెచ్చరిస్తున్నా.. ఎలాగైనా ఆ లోన్ తీర్చేయచ్చున్న ధీమాతో లోన్ యాప్స్ లో డబ్బు తీసుకుంటున్నారు. కొన్ని లోన్ యాప్స్ వారి అవసరాన్ని అవకాశంగా తీసుకుని ఇవ్వాల్సిన దానికంటే రెండు, మూడింతలు వసూళ్లకు పాల్పడుతున్నాయి. ఇలాంటి లోన్ యాప్స్ ను బ్యాన్ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

# దేశానికే మరో మణిహారం.. నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును ప్రారంభించిన ప్రధాని మోడీ

మొదటి పేజీ తరువాయి

ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయం..జేవర్ విమానాశ్రయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఇది ఆసియాలోనే అతిపెద్దదిగా, ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద విమానాశ్రయంగా అవతరించనుంది. దాదాపు రూ.11,282 కోట్ల వ్యయంతో మొదటి దశను పూర్తి చేశారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం సుమారు రూ. 29,560 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ప్రారంభ దశలో ఈ ఎయిర్‌పోర్టు ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించగలదు. భవిష్యత్తులో దీనిని 7 కోట్లకు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పొగమంచు సమయాల్లో కూడా విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా 3,900 మీటర్ల పొడవైన రన్‌వేను, అధునాతన నావిగేషన్ వ్యవస్థ ను ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రయాణికులు కేవలం 10 నిమిషాల్లో చెక్-ఇన్ ప్రక్రియ పూర్తి చేసుకునేలా డిజిటల్ వ్యవస్థను రూపొందించారు. ఈ ఎయిర్‌పోర్టు విమానాశ్రయం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంతో పాటు పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ఆయువుపట్టు కానుంది.

# కొత్త రూపం దాల్చిన బెట్టింగ్ దందా

## ఫామ్ హౌస్‌లు, ఆఫ్‌లైన్‌పై ప్రత్యేక నిఘా: సీపీ సజ్జనార్

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్ వేదికగా ఒక వీడియో విడుదల చేశారు. గతంలో #SayNoToBettingApps ప్రచారం ద్వారా వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చిందని తెలిపారు. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉందని వెల్లడించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని వెల్లడించారు.

# కొత్త పార్టీపై రాజకీయ చర్చ

## టీపీసీసీ చీఫ్ స్పందన

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): స్టేట్ పాలిటిక్స్‌లో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పెట్టబోయే కొత్త పార్టీపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆ వార్తలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రియాక్ట్ అయ్యారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ పెట్టుకోవచ్చని అన్నారు. అది వారి రాజ్యాంగబద్ధమైన హక్కు అని సానుకూలంగా స్పందించారు. కవిత కొత్త పార్టీ పెట్టడాన్ని తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

పార్టీ భవిష్యత్తు ప్రజల చేతుల్లోనే..: ఈ రోజుల్లో పార్టీలు పెట్టడం సులభమేనని.. వాటిని నడపడం ప్రజల మద్దతుపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రజలు ఆదరించినప్పుడు మాత్రమే ఏ రాజకీయ పార్టీ అయినా మనుగడ సాగిస్తుందని తెలిపారు. కేవలం పార్టీ ప్రకటించినంత మాత్రాన సరిపోదు, క్షేత్రస్థాయిలో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలి కామెంట్ చేశారు. రాష్ట్రంలో కొత్త పార్టీ రావడం వల్ల కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని, తమ ఓటు బ్యాంక్ చెక్కుచెదరదని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు మా ప్రభుత్వంపై.. తీసుకునే విధానాలపై పూర్తి నమ్మకంతో ఉన్నా మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

# హర్మూజ్ జలసంధిలో తగ్గని ఉద్రిక్తతలు

## రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు రెట్టింపు



న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి లో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా భారత్ తన వ్యూహాన్ని మార్చింది. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా చమురు సరఫరాకు ఆటంకాలు కలగడంతో భారత్ మళ్లీ రష్యా వైపు మొగ్గు చూపుతోంది. జనవరి నెలతో పోలిస్తే రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు ఏకంగా రెట్టింపు అయ్యే అవకాశం ఉందని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

దిగుమతుల్లో 40 శాతం రష్యాదే..

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భారత్ మొత్తం ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా 40 శాతానికి చేరుకోనుంది. సాధారణంగా భారత్ తన చమురు అవసరాల కోసం ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈలపై ఎక్కువగా ఆధారపడుతుంది. అయితే, హర్మూజ్ జలసంధి గుండా రవాణా కష్టతరం కావడంతో రష్యా నుంచి తక్కువ ధరకే లభించే చమురు భారత్‌కు ఊరటనిస్తోంది. అయితే, గతంలో రష్యన్ చమురుపై ఆంక్షలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయంగా చమురు ధరలను కంట్రోల్ చేసేందుకు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 30 రోజుల పాటు మినహాయింపువ్వగా అది భారత్‌కు పూర్తిగా కలిసొచ్చింది. మార్చి 19న భారత పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, రష్యా డిప్యూటీ ఇంధన మంత్రి పావెల్ సోరోకిన్ మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రష్యా నుంచి కేవలం ముడి చమురు మాత్రమే కాకుండా, నేరుగా ఎల్ఎన్‌జీ విక్రయాలను కూడా పునరుద్ధరించే దిశగా ఇరు దేశాలు అడుగులు వేస్తున్నాయి.

# ఉస్మానియా పేరుతో కల్తీ బిస్కెట్లు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం

న్యూస్ డెస్క్, 28 మార్చి (క్రాంతి న్యూస్): అంబర్‌పేట్ ప్రాంతంలో నకిలీ (కల్తీ) ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తున్న ఓ ఫ్యాక్టరీ పై పోలీసులు, ఆహార భద్రత అధికారులతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. బిస్కెట్లకు ఆకర్షణీయమైన రంగు, రుచి కలిగించేందుకు నిషేధిత, ప్రాణాంతక రసాయనాలను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, తక్కువ ఖర్చుతో ఉత్పత్తి పెంచేందుకు కుళ్ళిపోయిన, పాడైన గుడ్లను ఉపయోగిస్తున్నట్లు ఆధారాలతో సహా గుర్తించారు.

ఫ్యాక్టరీలో కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం, ఈగలు ముసురుతున్న మురికి వాతావరణంలోనే తయారీ కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితులు ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటన పై కేసునమోదు చేసి, ఫ్యాక్టరీ యజమాని పై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. స్వాధీనం చేసుకున్న ముడి సరుకులను ప్రయోగశాలకు పంపినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కుంజ రాము వ్యక్తి కాదు- ఒక తరానికి దిశానిర్దేశం

## తోటి పివిటిజి సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడప రఘు



కొత్తగూడ, 28 మార్చి (క్రాంతి న్యూస్):ఆదివాసి లిబరేషన్ టైగర్స్ వ్యవస్థాపకుడు కుంజ రాము 22వ వర్ధంతి సందర్భంగా మోకాళ్లపల్లె గ్రామంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి తోటి పివిటిజి సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడప రఘు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరియు తుడుందెబ్బ అధికార ప్రతినిధి సోయం సాంబయ్య టీచర్, తుడుందెబ్బ జాతీయ కార్యదర్శి సోయం రాజేందర్ పాల్గొని కుంజ రాము విప్లవ సేవలను స్మరించుకున్నారు. ఆయన కుమారుడు కుంజ సూర్యం సమక్షంలో జరిగింది. ఈసందర్భంగా మాట్లాడిన కొడప రఘు,ఆదివాసి స్వయం పాలన కోసం కుంజ రాము చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఆయన సతీమణి ధనసరి అనసూర్య (సీతక్క) నేడు ఎమ్మెల్యేగా, క్యాబినెట్ మంత్రిగా కొనసాగుతూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఇది ఆదివాసి సమాజానికి గర్వకారణమని అన్నారు.

కామ్రేడ్ ఓంకార్ ప్రభావంతో, పాలడుగు కృష్ణ మార్గ దర్శకత్వంలో కుంజ రాము ఆదివాసి హక్కుల కోసం పోరాటం ప్రారంభించి, తరువాత విప్లవ పంథాను ఎంచుకుని వివిధ గిరిజన సంఘాలను ఏకీకృతం చేసిన నాయకుడిగా నిలిచారని వివరించారు.సాధారణ జీవితం నుండి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగి,విద్య ద్వారా తనను తాను తీర్చిదిద్దుకున్న ఆయన జీవితం ప్రతి ఆదివాసి యువతకు ఆదర్శమని చెప్పారు.ఆయన చూపిన మార్గంలో నడుస్తూ,సీతక్క ఆదివాసి ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆమె భద్రాచలం పర్యటనలో ఉండటం వల్ల కార్యక్రమానికి హాజరు కాలేకపోయినప్పటికీ, కుమారుడు సూర్యం సమస్యలను వినిపించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు సోయం జగదీశ్వర్, ఆత్రం కుమారస్వామి, మాదన్నపేట గ్రామ ప్రధాన కార్యదర్శి కొడప రవి,సిపిఐ (ఎం. ఎల్)న్యూడెమోక్రసీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి ఆత్రం వెంకటస్వామి, యువజన సంఘం కో-కన్వీనర్ ఆత్రం ప్రశాంత్, గీసుకొండ కాంగ్రెస్ యువ నాయకుడు కొడప దిలీప్, సీనియర్ నాయకుడు కొడప మహేశ్, యువజన సంఘం సభ్యులు సోయం రవి, షెడ్మాకి సాయిరాం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# టీ.యు.జె.ఎ.సి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి, అరెస్ట్



సూర్యాపేట, 28 మార్చి (క్రాంతి న్యూస్): తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇల్లు, గుర్తింపు కార్డు ఇస్తామని, పెన్షన్ కల్పిస్తామని ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చేర్చిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినప్పటికి ఉద్యమకారుల హామీలను ప్రభుత్వం, విస్మరించిందని,తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్లెపు చంద్రన్న ప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు,టియుజెఏసి సూర్యాపేట జిల్లా ఇంచార్జ్ పిడమర్తి లింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల కు హామీల ను అమలు చేయాలని కోరుతూ టి యు జెఏసి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన తెలంగాణ అసెంబ్లీ ముట్టడిలో టీయుజెఏసి నాయకుల ను అరెస్ట్ చేయడం అప్ర జాస్వామికం అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో చర్చ జరగకపోవడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఉద్యమకారుల హామీల అమలుకు సబ్ కమిటీని ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక నిర్బంధాలు ఎదుర్కొని ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఉద్యమాన్ని కొనసాగించామని గుర్తు చేశారు. ఉద్యమకారుల అరెస్టును బిఆర్ఎస్, బిజెపి, ఖండించకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా ఉద్యమకారుల హామీలపై అసెంబ్లీలో చర్చ జరగాలని ఉద్యమకారుల అరెస్టు ను ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాలు, బిఆర్ఎస్, బిజెపి, సిపిఐ పార్టీ లు ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇట్టే ప్రభాకర్, బొల్లెపల్లి దయానందరావు, 1969 ఉద్యమకారులు కల్లెపు నరసన్న, తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మైలారపు కిరణ్, కాంపెల్లి సాయిలు, కనకం ఆంజనేయులు, టి యు జెఏసి మహిళా నాయకురాలు,ఓగిరాల సుజ్జి, బాలల లక్ష్మి తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

# జిల్లాలో పశువైద్య సేవల బలోపేతానికి ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- ప్రతీ ఇంట్లో లాభాల పాడి వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం లక్ష్యం
- మెరుగైన వైద్యానికి కావలసిన అన్ని సౌకర్యాల ఏర్పాటు




సూర్యాపేట, 28 మార్చి (క్రాంతి న్యూస్):చికిత్స కన్నా నివారణ మేలన్న సామెత.అనుసరించి పశువైద్యం ప్రజావైద్యం కన్నా ప్రాముఖ్యమని, జిల్లాలో పశు వైద్యసేవలు అభినందనీయం అని, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పశు వాద్యాధికారులను ప్రశంసించారు.కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించినపశువాద్యాధికారుల సమావేశంలో, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పాల్గొని మాట్లాడుతూ పశు ఆరోగ్యం, జాతి అభివృద్ధికి కృత్రిమ గర్భధారణ, ఆడదూడల కోసం లింగవిభజన వీర్యం వాడకం, వ్యాధుల నివారణకు టీకాలు మొదలు వినూత్నంగా, జంతువులకు అత్యవసర వైద్యంతో పాటు,ఆపరేషన్లు విరిగిన కాళ్ళకు రాడ్లు వేయడం, ఆర్థోపెడిక్ సర్జన్ల సహకారంతో కుక్కలకు వెన్నెముక ఆపరేషన్స్ తోపాటు, ఈ మధ్య ఆంధ్రాలో, కోడి పందాల్లో కాళ్ళు రెక్కలు విరిగి గాయాలైన పందెం కోళ్లకు కూడా మనజిల్లాలో వైద్యం అందించడం, సంతోషంగా ఉందన్నారు. నూటికి నూరు శాతం లక్ష్యాలను,సాధించిన శాఖ పశుసంవర్ధక శాఖ అని జిల్లాలో మరింత మెరుగైన సేవలతో, పశుపోషకుల ఆదాయ మార్గాలను పెంచడానికి కావాల్సిన, మౌలిక సదుపాయాలు అవసరాలు తెలియజేయాలని, అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని పశు వైద్యశాలల్లో ప్రజా సమాచారం కోసం పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఏర్పాటు, శౌచాలయాల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, ఆపరేషన్ పరికరాలకిట్లను అందిస్తామని తెలిపారు. మున్సిపాలిటీ పట్టణాల్లో వ్యాధిసోకిన పశువులను ఆసుపత్రికి తీసుకొచ్చి ఇంటి వద్ద దింపడానికి హైడ్రాలిక్ అంబులెన్స్, ఏర్పాటుతో పాటు ప్రతీ నియోజక వర్గానికి క్రిటికల్ ఆపరేషన్లకోసం, ఆర్థోపెడిక్ సర్జరీ పరికరాల కిట్టు ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని,పశుగ్రాసం కొరత తీర్చడానికి కావలసినంత పశుగ్రాస విత్తనాలు అందిస్తామని, ఆసక్తి గల సమభావన సంఘాలతో, పశుగ్రాసాలు పెంచి జిల్లాలో పశుగ్రాస బ్యాంక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోదాడ లో దాతల సహకారంతో పశు ఔషధ బ్యాంక్ ఏర్పాటుతో,అనతికాలంలో పశుపోషకులకు రూ. కోట్ల అదనపు సంపద సృష్టించడం అభినందనీయమని, జిల్లాలో ఇదే తరహాలో ఇతర పశువైద్యశాలల్లో పశు ఔషధ బ్యాంక్ ల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో 55 ఆఫీస్ సబార్డినేట్ పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని, అడిగిన జిల్లా అధికారికి ఆ పోస్టు లను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఇవ్వడానికి, ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కోదాడ, చిలుకూరు ఆసుపత్రులకు అల్ట్రా సౌండ్ కలర్ డాప్లర్ స్కానింగ్ యంత్రాలకు నిధులు ఇచ్చామని 50 పశువైద్య శిబిరాలకు కూడా నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఆసుపత్రుల్లో వైద్యులకు కుర్చీ టేబుల్స్, ఉపాధిహామీలో పశువులకొట్టాల మంజూరీ తక్షణమే ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సమాజంలో నూటికి 98.7 శాతం ప్రజలు పశు ఉత్పత్తులైన పాలు, మాంసం, గుడ్లు ఆహారంగా తీసుకుంటున్నారని, వారంతా ఆరోగ్యంగా ఉండాలంటే పశువైద్యం పటిష్టంగా ఉండాలని ఇక నుండి ఆకస్మిక తనిఖీలు చేపడుతామని తెలిపారు. అందరూ అంకిత భావంతో పని చేసి పశు ఆరోగ్యంతో పశుపోషకుల ఆదాయం పెంచి జిల్లాకి మంచి పేరు తేవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పశు, వైద్య మరియు పశుసంవ అధికారి డా, బి శ్రీనివాసరావు అసిస్టెంట్ డైరెక్టర్ లు డా వెంకన్న డా,పి పెంటయ్య , డా, సత్యనారాయణ, డా,బి వి ప్రసాద్ , పశువైద్యులు పాల్గొన్నారు.

# సురక్షితంగా గమ్యం చేరుకుందాం

## నినాదంతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం




రఘునాథపల్లి, 28 మార్చి (క్రాంతి న్యూస్): కంచనపల్లి నుంచి రఘునాథపల్లి కి వెళ్లే రోడ్డు లో ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామ యువకులు ముందుకొచ్చారు.“ సురక్షితంగా గమ్యం చేరుకుందాం” అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ డి నరేష్ ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా వారు హెల్మెట్ ధరించడం,సీటు బెల్ట్ వినియోగం,మద్యం సేవించి వాహనం నడపకూడదని,వేగ పరిమితులు పాటించాలని ప్రజలకు సూచించారు.రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడుతూ,రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణ నష్టం కలిగిస్తుందని తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమానికి గ్రామ ప్రజలు మద్దతు తెలుపుతూ,ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు.

# వైరా రోడ్డు ప్రమాద ప్రదేశాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్

## సైన్ బోర్డు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశం




ఖమ్మం/వైరా, 28 మార్చి (క్రాంతి న్యూస్): వైరాలో జరిగిన రోడ్డు ప్రమాద ప్రదేశాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. శనివారం వైరాలో రిలయన్స్ ట్రెండ్ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సును, లారీ కంటైనర్ ఢీ కొన్న ఘటనలో పలువురు ప్రయాణికులు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్పందించిన పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో హాస్పిటల్ తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వైరాలోని ప్రమాద ప్రదేశాన్ని సందర్శించి, ప్రమాదం గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సైన్ బోర్డు, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, స్లిప్ రోడ్డును తక్షణమే సరిచేయమని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ 99 రోజుల ‘ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమంలో భాగంగా ఈ వారాన్ని ‘అరైవ్ అలైవ్’ ప్రచారాన్ని ప్రజల్లో తీసుకెళ్లేందుకు అంకితమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరుకోవడానికి సురక్షితమైన వాహనం నడపడం చాలా ముఖ్యమని అన్నారు. కుటుంబాలు క్షేమంగా ఉండాలని లక్ష్యంతో చేపట్టిన’అరైవ్ అలైవ్’ భావనపై దృష్టి పెట్టి ముఖ్యంగా బయటకు వెళ్తున్న తమ భర్తలను, కుమారులను సురక్షితంగా వాహనం నడిపి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఖమ్మంలో, వివిధ పోలీస్ స్టేషన్ లు ఇతర శాఖలతో కలిసి ‘అరైవ్ అలైవ్’ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం, గుంతలను పూడ్చడం, చెత్తాచెదారాన్ని తొలగించడం వంటి దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు.

# సప్త కళల సమ్మేళనం నేడే



ఖమ్మం, 28 మార్చి (క్రాంతి న్యూస్): ఫైర్ ప్రార్థవిక అండ్ పండు ఎంటర్టైన్మెంట్స్ వారు సమర్పించు, సప్త కళల సమ్మేళనం తేదీ 29,3,2026 ఆదివారం సమయం సాయంత్రం 6.30 నిమిషాలకు వేదిక భక్త రామదాసు కళాక్షేత్రం ఖమ్మం అందరు ఆహ్వానితులే, సప్త కళల సమ్మేళనం అతిథులుగా ముఖ్య అతిథిగా కురువెళ్ల ప్రవీణ్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మిత్ర గ్రూప్ చైర్మన్ సభ అధ్యక్షుడు, వేల్పుల విజేత ఖమ్మం కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి విశిష్ట అతిథులు కళాసారథి ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగ బత్తిని రవి, వి.వి అప్పారావు, ఖమ్మం కళాపరిషత్ గౌరవ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, బొమ్మ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ గుర్రం కాంతారావు, ట్రస్మ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చెల్లా శేషగిరిరావు, అధ్యక్షులు ఖమ్మం జిల్లా ప్రవేట్ జూనియర్ కళాశాలలు యం.డి జాఫర్ మతిన్ , ట్రస్మా డివిజన్ అధ్యక్షులు కాళ్ల పాపారావు, తెలంగాణ ఏజెన్సీ అతిథులుగా సప్త కళలు సమ్మేళనం పాల్గొంటారు. ఈ సందర్భంగా నాగబత్తిని రవి విజేత మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో ప్రదర్శనలు బొమ్మ డాన్స్, టీవీ అండ్ సినీ ఆర్టిస్ట్ జంక్షన్ శీను జూనియర్ చిరంజీవి డూప్ డాన్స్, డబల్ హిట్ డాన్స్, హలో మేన్ డాన్స్, స్ప్రింగ్ డాన్స్, వెరైటీ బొమ్మ డాన్స్, అరుణ్ కుమార్, చెన్నై వారి చే సైకిల్ రిమ్ములు డాన్స్, సింగిల్ లెగ్ ప్రభు చెన్నై వారి చే, ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ సంస్కృతిక సారథుల ఆటపాట ఫైర్ కుటుంబం ప్రదర్శనలు, ఫైర్ మ్యాజిక్, జగ్లింగ్ రింగ్, భరతనాట్యం, స్కేటింగ్ పై భరతనాట్యం ఉంటాయి.అని, ఈ సందర్భంగా తెలియజేసినారు. అదే విధంగా ప్రేక్షక దేవుళ్ళు కవులు, కళాకారులు ప్రేక్షకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫైర్ కుటుంబం ఈ సందర్భంగా కోరారు.

# యువత బెట్టింగ్ కి దూరంగా ఉండాలి



నవాబుపేట, 28 మార్చి (క్రాంతి న్యూస్):ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో యువత బెట్టింగ్లకు దూరంగా ఉండాలని నవాబుపేట్ ఎస్సై గిరి సూచించారు. ఐపీఎల్ పేరుతో జరుగుతున్న అక్రమ బెట్టింగ్లలో పాల్గొనడం చట్టవిరుద్ధమని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిఘా ఉంచాలని సూచించారు. ఎవరైనా బెట్టింగ్లు నిర్వహిస్తున్నట్లు లేదా పాల్గొంటున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై గిరి కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## రాజధాని అమరావతి చట్టబద్ధతపై వైఎస్ షర్మిల కౌంటర్.. మరి వాటి సంగతేంటని చంద్రబాబుకు సూటి ప్రశ్న




ఏపీ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): రాజధాని అమరావతి చట్టబద్ధతకు అసెంబ్లీ తీర్మానం హర్షణీయమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. శనివారం ఏపీ అసెంబ్లీ లో చట్ట సవరణ తీర్మానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించడంపై ఆమె ట్విట్టర్ వేదిక ద్వారా స్పందించారు. చట్టబద్ధతకు సెక్షన్ 5 సవరణకు కేంద్రాన్ని కోరడం న్యాయబద్ధమేనని పేర్కొన్నారు.

మళ్లీ జగన్ లాంటోళ్లు వస్తే అని ముందుచూపు ఉండడం మీ విజన్ కి నిదర్శనం అనుకున్నా, రాజధాని కోసం విభజన చట్టంలో పెట్టిన సెక్షన్ 94(3) సంగతేంటని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. సెక్షన్ 94(3) కింద అమరావతి ఫండ్స్ అడిగేందుకు తీర్మానం ఎందుకు చేయడం లేదని , గెజిట్‌తోనే అమరావతి గెయిన్ అవుతుందా ? ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదే అని నరేంద్ర మోదీకి తెలియదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

ఎంతైతే అంత కేంద్రం నిధులు ఇవ్వాల్సిందే అనే క్లాజ్ సెక్షన్ 94(3డీ) చదవలేదా? . కేంద్రం చేస్తున్న మోసంపై అసెంబ్లీ తీర్మానం వద్దా ? నిధులు హక్కుగా ఇవ్వాల్సిందేనని తీర్మానం ఎందుకు చేయడం లేదని నిలదీశారు. విభజన చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తుంటే అసెంబ్లీ వేదికగా తీర్మానం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అమరావతి నిర్మాణానికి పట్టే రూ.1 లక్ష కోట్లు ప్రజల నెత్తిమీద వేస్తారా? . ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన సంధిస్తున్న ప్రశ్నలపై కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

## ఉగ్ర కదలికలపై ప్రభుత్వం సీరియస్.. కీలక ఆదేశాలు




ఏపీ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): రాష్ట్రంలో వెలుగులోకి వస్తున్న ఉగ్ర కదలికలపై ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఇటీవల విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన దర్యాప్తులో ఇతర ప్రాంతాలతో కలిపి 12 మందిని అరెస్ట్ చేసిన నేపథ్యాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాయచోటి సంఘటన అనంతరం ఉగ్ర కదలికలు వివిధ రూపాల్లో బయటపడుతున్నాయని పేర్కొన్నారు. గతంలో కూడా విజయవాడ కేంద్రంగా రోహింగ్యాలు పట్టుబడిన ఘటనలను గుర్తుచేశారు.

తాజాగా సోషల్ మీడియా ద్వారా ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న ముఠాను దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో ప్రజలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. దేశ భద్రత దృష్ట్యా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు, దర్యాప్తు సంస్థలకు తెలియజేయాలని సూచించారు. అలాగే, దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకున్న తర్వాత కొందరు తప్పుడు కథనాలు చెప్పే అవకాశముందని, అలాంటి వాటిని నమ్మకూడదని మాధవ్ హెచ్చరించారు.

## ఎమ్మెల్యే గోవిందరావుపై టీడీపీ అధిష్టానం సీరియస్.. క్షమాపణలు చెప్పాలని ఆదేశం



ఏపీ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల పట్ల కొందరు అధికారదాహంతో వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు నిర్వహించే కార్యక్రమాలను, సేవలను ఎండనక, వానకన ప్రతినిత్యం ప్రజలకు అందిస్తున్నారని కూడా అర్థం చేసుకోకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కొన్ని సందర్భాలలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నారనే అక్కశుతో జర్నలిస్టులను దుర్భాషలాడుతున్నారు. ఇలాంటి ఘటన రాష్ట్రంలో మరోసారి చర్చనీయాంశమైంది.

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు ఇటీవల ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఆ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు ఓ ప్రతికా విలేఖరి వెళ్లారు. ఆ సమయంలో ఓ విషయంలో ఎమ్మెల్యేను విలేఖరి ప్రశ్నించారు. దీంతో గోవిందరావు ఊగిపోయారు. నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. అందరిలో విలేఖరిని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో జర్నలిస్టు సంఘాలు, స్థానిక ప్రజలు తప్పుబట్టారు. ఎమ్మెల్యే తీరుపై విమర్శలు కురిపించారు. ఈ విషయం పార్టీ అధిష్టానం దృష్టికి చేరింది. దీంతో ఆ పార్టీ అధ్యక్షుడు సీరియస్ అయ్యారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు హుందాగా ఉండాలని, బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. విలేఖరిని దూషించినందుకు క్షమాపణలు క్షమాపణలు చెప్పాలని ఆదేశించారు. అలాగే జరిగిన ఘటనపై వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యేకు పార్టీ అధ్యక్షుడు సూచించారు. మరోసారి పునరావృతం కాకూడదని హెచ్చరించారు.

## గ్యాస్ సిలిండర్లతో డెలివరీ బాయ్ పరార్



ఏపీ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఒకవైపు, స్థానిక మోసాలు మరోవైపు వెరసి సామాన్యుడి గ్యాస్ కష్టాలు రెట్టింపవుతున్నాయి. విశాఖపట్నం జిల్లాలో జరిగిన ఒక వింత సంఘటన ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

గ్యాస్ సిలిండర్లతో డెలివరీ బాయ్ పరార్..


ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న దాడులు, ప్రతిదాడుల ప్రభావం అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై తీవ్రంగా పడుతోంది. యుద్ధం ముగుస్తోంది అని చెబుతూనే.. దాడులకు తెగబడటం గ్యాస్ మరియు ముడి చమురు ధరల పెరుగుదలకు కారణమవుతోంది. ఈ అంతర్జాతీయ పరిణామాలు సామాన్యుడి వంటగదిపై భారాన్ని పెంచుతుంటే.. క్షేత్రస్థాయిలో డెలివరీ బాయ్స్ చేసే మోసాలు వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి.

విశాఖపట్నం గంట్యాడలోని ఒక గ్యాస్ ఏజెన్సీలో అప్పారావు అనే వ్యక్తి డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వరుసగా ఎండలు ముదురుతున్న వేళ, గ్యాస్ కష్టాలు కూడా తోడయ్యాయి. ఈ క్రమంలో అప్పారావు ఒక మాస్టర్ ప్లాన్ వేశాడు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేయకుండానే, వినియోగదారుల వద్దకు వెళ్లి ఏదో సాకు చెప్పి ముందే ఒటీపి తీసుకున్నాడు. ఇలా సుమారు 30 మంది కస్టమర్ల నుంచి ఓటీపీలు సేకరించి, ఆ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకున్నాడో లేదా తనతో పాటే పట్టుకుపోయాడో తెలియదు కానీ.. ఏకంగా 30 సిలిండర్లతో అదృశ్యమయ్యాడు.

చాలాసేపటికీ సిలిండర్లు రాకపోవడం, అప్పటికే డెలివరీ సక్సెస్ అయినట్లు మెసేజ్‌లు రావడంతో కస్టమర్లు ఏజెన్సీని నిలదీశారు. తీరా చూస్తే అప్పారావు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. దీంతో గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతర్జాతీయంగా ధరలు పెరగడం వల్ల సబ్సిడీ తగ్గి, సిలిండర్ ధర సామాన్యుడికి భారంగా మారింది. ఇటువంటి సమయంలో డెలివరీ బాయ్స్ ఓటీపీల పేరుతో మోసం చేయడం విచారకరం.

డెలివరీ బాయ్స్‌ను నమ్మి ఓటీపీలు ఇవ్వడం వల్ల ఇలాంటి మోసాలు జరుగుతున్నాయి. సిలిండర్ చేతికి అందిన తర్వాతే ఓటీపీ చెప్పాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. యుద్ధాల వల్ల వచ్చే ఆర్థిక ఇబ్బందులను తట్టుకోవడం ఒక ఎత్తైతే, ఇలాంటి స్థానిక దొంగతనాల వల్ల కలిగే నష్టం మరొకటి. అప్పారావు ఉదంతం గ్యాస్ వినియోగదారులందరికీ ఒక గుణపాఠంగా మారింది.

## తనకు కాకుండా చేస్తోందని.. ప్రియుడి భార్యపై ప్రియురాలు హత్యాయత్నం



ఏపీ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): కాలం మారుతున్న కొద్ది సమాజంలో విలువలు పతనం అవుతున్నాయి. ప్రేమ, పెళ్లి అనే పదాలకు అర్థాలు మారిపోతున్నాయి. తాజాగా తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని ఏకంగా ప్రియుడి భార్యను హత్య చేసిందుకు కంత్రీ ప్లాన్ చేసి కటకటాల పాలైంది ఓ ప్రియురాలు. అంతా పక్కాగా స్కెచ్ వేసినా చివరి నిమిషంలో బెడిసి కొట్టడంతో అడ్డంగా బుక్కయింది. తీవ్ర కలకలం రేపిన ఈ ఘటన ఆంధ్రప్రదేశ్?లోని చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలంలో చోటు చేసుకుంది.


తన ప్రియుడు దక్కకుండా పోతాడనే భయంతో..

బోయపల్లి గ్రామానికి చెందిన దిలీప్, రోజా దంపతులు. అయితే దిలీప్?కు అదే గ్రామానికి చెందిన భాను అనే మరో మహిళతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. గత ఐదేళ్లుగా వీరిద్దరి మధ్య ఎఫైర్ కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారం దిలీప్ భార్య రోజాకు తెలిసిపోయింది. దీంతో తన భర్తను రోజా నిలదీసింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు కొనసాగుతున్నాయి. కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండటంతో దిలీప్ తన కొద్ది రోజులుగా తన ప్రియురాలిని దూరం పెడుతూ వస్తున్నాడు. అయితే రోజా వల్లే తన ప్రియుడు తనను దూరం పెడుతున్నాడని భావించిన బాను.. రోజాపై కక్ష పెంచుకుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే తన ప్రియుడు తనకు దక్కకుండా పోతాడని భావించి ఓ కంత్రీ ప్లాన్ కు వ్యూహరచన చేసింది.

ఒంటరిగా ఉండగా ఎటాక్:

రోజాను అంతం చేస్తేనే తన ప్రియుడు తనకు దక్కుతాడని భావించిన భాను ఇక రోజాను చంపాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం తన స్నేహితురాలు తులసి సహకారం తీసుకుంది. ఇటీవల రోజా ఇంట్లో ఒక్కతే ఉన్నట్లు గుర్తించిన భాను తులసితో కలిసి ఆమె ఇంటికి వెళ్లింది. అక్కడ రోజా నోట్లో గుడ్డ కుక్కి బండరాయితో తలపై మోదీ హత్య చేసేందుకు ప్రయత్నించింది. వెంటనే తేరుకున్న రోజా గట్టిగా అరవడంతో స్థానికులు వచ్చేలోపు భాను, తులసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో తీవ్ర గాయాలైన రోజాను స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె కండీషన్ సీరియస్?గా ఉండటంతో వేలూరు సీఎంసీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు భాను, తలసిపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు.

## శ్రీకాళహస్తి ఆలయంలో అడుగడుగునా వసూళ్లు.. భక్తురాలి ఆవేదన వైరల్



ఏపీ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో భక్తులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది. దైవ దర్శనానికి వెళ్లిన ఒక మహిళా భక్తురాలు, ఆలయంలో అడుగడుగునా జరుగుతున్న అవినీతి, వసూళ్లపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గేటు దగ్గర సెక్యూరిటీ మొదలుకొని లోపల పూజల వరకు డబ్బుల కోసం సిబ్బంది అడుక్కుంటున్నారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు.

గేటు వద్దే వసూళ్లు.. లోపల కూడా..

'మీకు తొందరగా దర్శనం కావాలంటే రూ.300 ఇవ్వాలని' ఆలయ ఎంట్రన్స్ దగ్గర ఉన్న ఒక గార్డు తనను అడిగారని సదరు భక్తురాలు తెలిపారు. ఫ్లైట్‌కు సమయం మించిపోతోందన్న తొందరలో ఆ డబ్బులు చెల్లించినట్లు ఆమె పేర్కొన్నారు. గుడి లోపలికి వెళ్లిన తర్వాత కూడా ప్రతి దశలోనూ డబ్బులు అడగడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయంలో పోలీసులు సైతం పరోక్షంగా డబ్బులు ఆశించడం చూసి తాను విస్మయానికి గురయ్యానని ఆమె అన్నారు.

రాజకీయాలు వద్దు.. పరిష్కారం కావాలి

ఈ వీడియోపై సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు విస్తృతంగా స్పందిస్తున్నారు. సదరు మహిళ మాటల్లో నిజాయితీ స్పష్టంగా కనిపిస్తోందని పలువురు నెటిజన్‌లు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యను రాజకీయ కోణంలో చూడకూడదని, ఇది ఏ ఒక్క ప్రభుత్వానికో పరిమితమైన సమస్య కాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలోనూ ఈ తరహా అవినీతి జరిగిందని, ప్రభుత్వాలను నిందించడం కన్నా వ్యవస్థను ప్రక్షాళన చేయడం ముఖ్యమని అభిప్రాయపడుతున్నారు. పవిత్ర క్షేత్రంలో జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వంపై వైసీపీ విమర్శలు

ఈ ఘటనపై ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. 'అవినీతి, అక్రమాల విత్తనంలోంచి పుట్టుకొచ్చిన కూటమి ప్రభుత్వంలో గుడి, బడి అనే తేడా లేకుండా అవినీతి పొంగిపొర్లుతోంది. శ్రీకాళహస్తి దేవాలయంలో అడుగడుగునా వసూళ్లకు దిగుతున్నారు. మరోవైపు దేవాదాయ శాఖలో జరుగుతున్న లీలలు అన్నీఇన్నీ కావు' అని వైసీపీ ఆరోపించింది.


## ఆగిఉన్న బస్సును ఢీకొట్టిన కారు..

### ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం



ఏపీ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్పాట్‌లోనే దుర్మరణం పాలైన విషాద ఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి – బెంగళూరు జాతీయ రహదారిపై శేషాపురం వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి కారు అతివేగంతో అదుపుతప్పి బలంగా ఢీకొంది. ఈ దుర్ఘటనలో కారులో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులు వరంగల్ జిల్లాకు చెందిన శ్రీధర్ రావు, లక్ష్మీ, అద్వికగా గుర్తించారు. బెంగళూరు నుంచి తిరుమలకు కారులో వెళ్తుండగా.. ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## తిరుపతిలో 'చెడ్డి గ్యాంగ్' కలకలం : అప్రమత్తమైన యజమాని.. పరారైన దొంగలు




ఏపీ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్):తిరుపతిలో చెడ్డి గ్యాంగ్ మరోసారి హల్ చల్ చేసింది. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లోకి అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. అయితే, ఇంటి యజమాని సునంద కుమార్ రెడ్డి సకాలంలో అప్రమత్తం కావడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దొంగల కదలికలకు సంబంధించిన దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

బాధితుడు సునంద కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దొంగల కోసం గాలిస్తున్నారు. చెడ్డి గ్యాంగ్ ఆగడాలతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రం,అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన - జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్, 28 మార్చి (క్రాంతి న్యూస్): జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, చిన్న గూడూరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల సరళిని పరిశీలించారు. మార్చి 14 తేదీ నుండి జిల్లాలోని (45) పరీక్షా కేంద్రాల ద్వారా (8157) మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వ సూచనల ప్రకారం ఫ్లయింగ్ స్క్వాడ్స్ (3) సిట్టింగ్ స్క్వాడ్స్ ప్రతీ కేంద్రానికి ఒక్కటి, సుమారు (528) పరీక్షల నిర్వహణ సిబ్బంది, (45) వైద్య బృందాల సిబ్బంది, అదనపు కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, నిత్య పర్యవేక్షణలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు కొనసాగడం జరుగుతుందన్నారు, చీఫ్ సూపర్డెంట్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాల ఓపెనింగ్, క్లోజింగ్ ప్రక్రియ, విద్యాశాఖ ప్రధాన కార్యాలయం నుండి వైర్లెస్ సెట్ ద్వారా పర్యవేక్షణ సూచనలు జారీ చేస్తున్నారని, డీఈవో వి.రాజేశ్వర్, డోర్నకల్, కురవి (6) ఏజిసి మందుల శ్రీరాములు మహబూబాబాద్, గార్ల, బయ్యారం, 6 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ (18) కేంద్రాలలో జరుగుతున్న పరీక్షల సరళని తనిఖీ చేశారనీ, (8165) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 99.89 శాతం నమోదు అయ్యిందని తెలిపారు, ఏప్రిల్ 16 వరకు జరిగే పరీక్షల నిర్వహణలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉందని తెలిపారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను హాజరు, వివరాలను, స్టాకును తనిఖీ చేశారు,పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి అర్థమయ్యే విధంగా విద్యను అందించాలని సూచించారు, అంగన్వాడి కేంద్రం పరిధిలో ఉన్న శ్యామ్, మ్యామ్, పిల్లలను గమనిస్తూ ఉండాలని, బాలింతలకు, గర్భిణీలకు, చిన్నపిల్లలకు, బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు, పిల్లల హాజరు శాతం పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. అన్ని విద్యాసంస్థలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# పల్లగుట్టలో శ్రీరామనవమి వేడుకల్లో ఉద్రిక్తత

- రాజకీయ రగడతో ఘర్షణలు
- కాంగ్రెస్-బిఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- సర్పంచ్ కుటుంబంపై దాడి ఆరోపణలు
- ఇరువర్గాల నుంచి పోలీసులకు ఫిర్యాదులు





జనగామ/చిల్పూర్, మార్చి 28 (క్రాంతి న్యూస్): జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలోని చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు ఉద్రిక్తతలకు దారితీశాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాల్సిన ఉత్సవాలు రాజకీయ వివాదాలతో ఘర్షణలకు దారితీయడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం రాత్రి శ్రీ సీతారామ చంద్రస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు సందర్భంగా నిర్వహణపై తలెత్తిన వివాదం కాంగ్రెస్,బిఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదానికి దారితీసింది. మాట మాట పెరిగి ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగడంతో పరిస్థితి మరింత విషమించింది. ఇదే ఘటనలో గ్రామ సర్పంచ్‌కు ఆహ్వానం ఇవ్వలేదనే కారణంతో, సర్పంచ్ కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన శ్యాం బాబు పై దాడి జరిగినట్లు సమాచారం. శ్యాం బాబు మీడియాతో మాట్లాడుతూ, శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం అనంతరం రాత్రి సర్పంచ్ ఎనుగందుల నరసింహారెడ్డి,ఆయన తమ్ముడు రత్నాకర్ రెడ్డి కలిసి తమపై దాడి చేశారని ఆరోపించారు.అయితే ఈ ఆరోపణలను సర్పంచ్ ఎనుగందుల నరసింహారెడ్డి ఖండించారు. తాను పూజా కార్యక్రమంలో పాల్గొని అక్కడి నుండి వెళ్లిపోయానని,అనంతరం జరిగిన ఘటనలతో తనకు సంబంధం లేదని తెలిపారు.ఘర్షణ జరుగుతోందని తెలిసి అక్కడికి వెళ్లి పరిస్థితిని శాంతింపజేయడానికి ప్రయత్నించానని చెప్పారు.తనపై వస్తున్న ఆరోపణలు అసత్యమని, కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

ఘర్షణల నేపథ్యంలో ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి.ఈ ఘటనపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.పవిత్రమైన శ్రీరామనవమి వేడుకలు రాజకీయ వివాదాలకు వేదిక కావడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.






# వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



ఖమ్మం, 28 మార్చి (క్రాంతి న్యూస్): వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు, అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ కాలనీగా అభివృద్ధి చేసి పేదలకు గౌరవప్రదమైన జీవన వాతావరణం కల్పిస్తామని, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మ్యాప్ ద్వారా వివరిస్తూ, కాలనీలో ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల పనులు పూర్తి అయ్యాయని, వాటర్ ట్యాంక్ నుండి ఇంటింటికీ త్రాగునీటి పైప్‌లైన్ అనుసంధానం జరుగిందని తెలిపారు. అలాగే అంతర్గత రోడ్ల నిర్మాణం, రవాణా సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల మౌళిక అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి కుటుంబానికి త్రాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు సమగ్రంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత పది సంవత్సరాల కాలంలో పేదలు మౌళిక సదుపాయాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని, తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన గృహ నిర్మాణం పూర్తి చేయించడమే లక్ష్యమని అన్నారు. వెలుగుమట్ల కాలనీలో విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, కాలువలు, పారిశుద్ధ్య వ్యవస్థ వంటి అన్ని సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసి ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని, మంత్రి స్పష్టం చేశారు. కాలనీలో స్కూల్, కమ్యూనిటీ హాల్, పార్క్ వంటి సామాజిక వసతులను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. నెలలోపు డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేయాలని, వర్షాకాలం కాలనీలో నీటి నిలువ సమస్యలు ఉండకూడదని మంత్రి ఆదేశించారు. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్దేశిత గడువులోనే అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఆర్ అండ్ బీ ఎస్.ఈ యాకుబ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈ.ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు డి.జయచందర్, సైదులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మాదిగ ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానము

## మాదిగల ఐక్య వేదిక ఆధ్వర్యంలో






వనపర్తి, 28 మార్చి (క్రాంతి న్యూస్): మాదిగల ఐక్య వేదిక వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాదిగ కులానికి చెందిన ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమం దాచ సులోచన కన్వెన్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కదిరే కృష్,డాక్టర్ మోత్కూపల్లి నర్సిములు మాజీ మంత్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అడిషనల్ డీజీపీ,గువ్వల బాలరాజు మాజీ శాసనసభ్యులు అచ్చంపేట ముఖ్య అతిథులు గా కార్యక్రమంకు హాజరు అయి ప్రసంగించారు జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ప్రజలకు సేవ చేస్తున్న ప్రజా ప్రతినిధులను గౌరవించడం సమాజానికి గౌరవాన్ని తీసుకువస్తుందని నాయకులు తెలిపారు డాక్టర్ కదిరే కృష్ణ మాట్లాడుతూ సమాజంలో చదువుతోనే ఏదైనా సాధ్యం అవుతుంది అని ప్రతి ఒక్కరు చదువుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు గెలుపొందిన సర్పంచ్ లు ఆత్మ గౌరవంతో సూపరిపాలన అందించాలని వారి పదవి కాలం పూర్తిగా సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ అభివృద్ధి చేయాలనీ సూచించారు మిగతా వక్తలు మాదిగలు ఐక్యతతో ముందుకు సాగాలని భవిష్యత్ రాజకీయ చైతన్యం కోసం ప్రతి ఒక్కరు ఏకం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,సామాజిక కార్యకర్తలు మరియు మాదిగల ఐక్య వేదిక సభ్యులు పెద్దింటి వెంకటేష్, గంధం నాగరాజ్,హైకోర్టు అడ్వకేట్ హంసువర్మ,గంధం పరంజ్యోతి మంద రాములు మీసాల రాము చిట్యాల తిరుపతి,డి మహేష్, వడ్డేమాన్ రవి,దారపోగు నాగరాజు,రాజనగరం రాజేష్,గంధం ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ ప్రజా ప్రతినిధి వెంకట్ రాములుకి ఘన సన్మానము చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్



వనపర్తి, 28 మార్చి (క్రాంతి న్యూస్): మాదిగల ఐక్య వేదిక వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాదిగ కులానికి చెందిన ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమం దాచ సులోచన కన్వెన్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కదిరే కృష్ణ,డాక్టర్ మోత్కూపల్లి నర్సిములు మాజీ మంత్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అడిషనల్ డీజీపీ,గువ్వల బాలరాజు మాజీ శాసనసభ్యులు అచ్చంపేట ముఖ్య అతిథులు గా కార్యక్రమంకు హాజరు అయి ప్రసంగించారు జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు,వార్డ్ మెంబెర్స్ లు, కౌన్సిలర్‌లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ప్రజలకు సేవ చేస్తున్న ప్రజా ప్రతినిధులను గౌరవించడం సమాజానికి గౌరవాన్ని తీసుకువస్తుందని నాయకులు తెలిపారు డాక్టర్ కదిరే కృష్ణ మాట్లాడుతూ సమాజంలో చదువుతోనే ఏదైనా సాధ్యం అవుతుంది అని ప్రతి ఒక్కరు చదువుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు గెలుపొందిన సర్పంచ్ లు ఆత్మ గౌరవంతో సూపరిపాలన అందించాలని వారి పదవి కాలం పూర్తిగా సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ అభివృద్ధి చేయాలనీ సూచించారు మిగతా వక్తలు మాదిగలు ఐక్యతతో ముందుకు సాగాలని భవిష్యత్ రాజకీయ చైతన్యం కోసం ప్రతి ఒక్కరు ఏకం కావాలని పిలుపు నిచ్చారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉపాహార ప్రసాద వితరణ





తొర్రూర్, 28 మార్చి (క్రాంతి న్యూస్): పట్టణ కేంద్రంలోని కంటాయ పాలెం రోడ్డులో గల. స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వికాస తరంగిణి తొర్రూరు శాఖ నిర్వహణలో ప్రతి శనివారం నిర్వహించే శాశ్వత శనివార కైంకర్య సేవలో భాగంగా ఈ శనివారం పట్టణ కేంద్రంలోని శ్రీకృష్ణ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల యజమాని ప్రముఖ డెంటల్ డాక్టర్ లయన్ బానోత్ కిరణ్ నాయక్ ప్రభుత్వ వైద్యులు స్రవంతి దంపతుల వివాహ వార్షి కోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు దాతగా వ్యవహరించి ఉపహార ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల శ్రీకాంతా చార్యులు దంపతులు ఇరువురి గోత్రనామాల పేరుమీద అర్చన చేసి స్వామి వారి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సాంప్రదాయాన్ని అనుసరించి డాక్టర్ కుందూరు రాజేందర్ రెడ్డి స్వామి వారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించి డాక్టర్ కిరణ్ నాయక్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతాపని వెంకటేశ్వర్లు నాళ్ళ కృష్ణమూర్తి ప్రసూన ఉపేందర్ రావు తమ్మి రమేష్ గోపారపు రామా ఉపేందర్ యాద వెంకటేశ్వర్లు మహానగరం లో న్యూస్ రిపోర్టర్ నాళ్ళ శ్రీనివాస్ జ్యోతి రిపోర్టర్ చోడవరపు రాము వెంశెట్టి జగదీష్ దొడ్డ రఘు దొడ్డ శ్రీనివాస్ గుమ్మడవల్లి మధు భక్తులు తదితరులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

# మహిళల్లో పెరుగుతున్న గుడ్ గర్ల్ సిండ్రోమ్

## సమస్య.. ఏంటిది.. దీని వల్ల ఏం జరుగుతుంది..?

హెల్త్ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): గుడ్ గర్ల్ సింద్రోమ్ అనేది అధికారిక వైద్య నిర్ధారణ కాకపోయినా, సమాజం విధించిన అంచనాల ప్రభావంతో ఏర్పడే ప్రవర్తనా నమూనాగా నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో మహిళలు పరిపూర్ణంగా కనిపించడానికి, ఇతరుల అభిమానం పొందడానికి తమ వ్యక్తిగత అవసరాలను అణచివేస్తుంటారు. దీని వల్ల పీపుల్ ప్లీజింగ్, గొడవల పట్ల భయం, స్వీయ హద్దులను నిర్ధారించలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అలాగే ఈ సింద్రోమ్ వల్ల మహిళలలో హార్మోన్ అసమతుల్యతలు పెరుగుతున్నాయని, బయటకు ఒత్తిడి కనిపించకుండా ఎప్పుడూ అంచనాలకు తగ్గట్టు ఉండాలనే ప్రయత్నం శరీరంలో నిరంతర ఒత్తిడిని కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా భావోద్వేగాలను ఎక్కువ కాలం అణచివేయడం వల్ల శరీరం ఎప్పుడూ స్ట్రెస్ మోడ్ లోనే ఉండిపోతుంది. న్యూరోసైన్స్ అండ్ బయో బిహేవియరల్ రివ్యూస్ వంటి పరిశోధనలు భావోద్వేగ ఒత్తిడి కారణంగా హార్మోన్లలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని సూచిస్తున్నాయి.



**కార్టిసాల్ స్థాయిలు నిరంతరంగా అధికమే..**

మాలిక్యులర్ సైకియాట్రీ పరిశోధన ప్రకారం, నిరంతరం ఇతరుల ఆమోదం కోసం ప్రయత్నించడం, వైఫల్య భయం ఉండటం వంటివి మెదడులో థ్రెట్ సిగ్నల్‌ను కలిగిస్తాయి. దీంతో హైపోథాలమస్-పిట్యూటరీ-అడ్రినల్ యాక్సిస్ సక్రియమై హార్మోన్ సమతుల్యత దెబ్బతింటుంది. ఈ ప్రక్రియలో ముఖ్యంగా కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ అధికంగా ఉత్పత్తి అవుతుంది. సాధారణంగా ఇది తాత్కాలికంగా పెరిగి తగ్గిపోవాలి. కానీ పరిపూర్ణత కోసం ఎప్పుడూ ఒత్తిడిలో ఉండే మహిళలలో ఇది నిరంతరం ఎక్కువగా ఉంటుంది. 2025లో లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, అధిక కార్టిసాల్ వల్ల ప్రొజెస్టిరోన్ తగ్గిపోవడం జరుగుతుంది. దీనివల్ల మెన్స్ట్రువల్ సమస్యలు, మొటిమల వంటి సమస్యలు వస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే, ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరగడం ద్వారా పోలిసిస్టిక్ ఓవరీ సింద్రోమ్ లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. అధిక కార్టిసాల్ కారణంగా రక్తంలో గ్లూకోజ్ పెరిగి, దాన్ని నియంత్రించేందుకు శరీరం ఎక్కువ ఇన్సులిన్ విడుదల చేస్తుంది. దీని ఫలితంగా పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం, అండోత్పత్తి లోపాలు వస్తాయి.

**అనేక అనారోగ్య సమస్యలు..**

ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నప్పటికీ, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు, ఆసియా కుటుంబాల్లో దీన్ని ఎక్కువగా గమనిస్తున్నామని పరిశోధనలు తెలుపుతున్నాయి. పాత విలువలను కొనసాగించే తల్లిదండ్రుల ఒత్తిడి కూడా ఈ పరిస్థితికి కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుడ్ గర్ల్ సింద్రోమ్ వల్ల శరీరంలో అనేక హెచ్చరిక సంకేతాలు కనిపిస్తాయి. నెలసరిలో మార్పులు, అండోత్పత్తి ఆగిపోవడం (అమెనోరియా), నిద్రలేమి, నిరంతర అలసట వంటి సమస్యలు వస్తాయి. అలాగే ఆందోళన, మూడ్ స్వింగ్స్, మెదడు మబ్బుగా ఉండటం వంటి న్యూరోలాజికల్ లక్షణాలు కూడా కనిపిస్తాయి. మెటాబాలిక్ మార్పుల కారణంగా కఠినమైన డైట్ పాటించినా బరువు తగ్గకపోవడం, థైరాయిడ్ పనితీరు మందగించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ భావోద్వేగ ఒత్తిడి, హార్మోన్ అసమతుల్యతల సంకేతాలుగా భావించాలి.

**ఈ సూచనలు పాటించాలి..**

ఇక పరిస్థితిని ఎదుర్కోవడానికి నిపుణులు సూచనలు కూడా చేస్తున్నారు. థైరాయిడ్, ఇన్సులిన్, ప్రొక్రియేటివ్ హార్మోన్ల కోసం క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. పీసీఓఎస్ లేదా థైరాయిడ్ సమస్యలు ఉంటే వెంటనే చికిత్స తీసుకోవడం ప్రారంభించాలని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను నియంత్రించవచ్చని వారు చెబుతున్నారు. వీటితో పాటు జీవనశైలి మార్పులు కూడా చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సరైన నిద్ర హార్మోన్ సమతుల్యతను పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే యోగా, వ్యాయామం ద్వారా శరీరంలోని ఫైట్ ఆర్ ఫ్లైట్ ప్రతిస్పందన తగ్గుతుంది. అదేవిధంగా భావోద్వేగాలను అణచివేయకుండా జర్నలింగ్ లేదా థెరపీ ద్వారా విడుదల చేయడం కూడా అవసరం. ఈ విధంగా ఒత్తిడిని తగ్గించడం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. పరిపూర్ణత కోసం పరుగులు తీయడం కన్నా శారీరక-మానసిక సమతుల్యతను కాపాడుకోవడం ముఖ్యం. ఇతరుల ఆమోదం కంటే స్వీయ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మహిళలు నిజమైన ఆరోగ్యాన్ని సాధించగలరని నిపుణులు సూచిస్తున్నారు.

---

# నట్స్‌ను నేరుగా అలాగే తినాలా.. వేయించి తినాలా.. ఎలా తింటే మంచిది..?

హెల్త్ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): రోజువారీ ఆహారంలో ఆరోగ్యకరమైన స్నాక్స్‌గా గింజల ప్రాధాన్యం పెరుగుతోంది. ఉదయం బాదం, సాయంత్రం టీతో వేరుశనగలు, మధ్యాహ్నం లేదా సాయంత్రం ఆకలిని తగ్గించేందుకు జీడిపప్పు. ఇలా గింజలు చాలా మంది దైనందిన జీవనశైలిలో భాగమయ్యాయి. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న కొద్దీ, నట్స్ ను అలాగే తినడం మంచిదా? లేక రోస్టెడ్ నట్స్ మంచివా? అనే ప్రశ్న ఎక్కువగా చర్చకు వస్తోంది. కొందరు సహజ రూపంలో ఉన్న ముడి నట్స్ పోషకాలతో నిండి ఉంటాయని భావిస్తే, మరికొందరు రోస్టెడ్ నట్స్ రుచిగా ఉండి తినడానికి సులభమని అంటున్నారు.



**తేడా ఏమిటి..?**

ముడి నట్స్‌లో ముఖ్యంగా విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు వంటి ఉష్ణానికి సున్నితమైన పోషకాలు ఎక్కువగా నిల్వ ఉంటాయి. వేడి ప్రక్రియకు గురి కానందున ఇవి సహజ లక్షణాలను ఎక్కువగా కాపాడుకుంటాయి. కొన్ని పరిశోధనల ప్రకారం రోస్టింగ్ సమయంలో కొంతమేర పోషకాల నష్టం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, అది చాలా పెద్దగా ప్రభావం చూపదు. అయినప్పటికీ యాంటీ ఆక్సిడెంట్‌లను ఎక్కువగా పొందాలనుకునే వారికి ముడి నట్స్ కొద్దిగా మెరుగైన ఎంపికగా భావించవచ్చు. ఇక రుచి, జీర్ణశక్తి విషయానికి వస్తే, రోస్టెడ్ నట్స్‌కు ప్రత్యేకమైన ఆకర్షణ ఉంది. రోస్టింగ్ వల్ల గింజల రుచి, సువాసన, క్రంచ్ పెరుగుతాయి. అదే సమయంలో ఫైటిక్ ఆమ్లం వంటి యాంటీ న్యూట్రియెంట్లు తగ్గి, ఖనిజాల శోషణ మెరుగుపడే అవకాశం ఉంటుంది. అందువల్ల కొందరికి రోస్టెడ్ నట్స్ తినడం సులభంగా అనిపిస్తుంది. రుచిగా ఉండటం వల్ల వీటిని తరచుగా తినే అలవాటు కూడా పెరుగుతుంది.

**డ్రై రోస్టెడ్, అన్‌సాల్టెడ్ అయితే మంచిది..**

కొవ్వు , నూనెల విషయానికి వస్తే, ముడి నట్స్, డ్రై రోస్టెడ్ నట్స్‌లో సహజ కొవ్వు దాదాపు సమానంగా ఉంటుంది. అయితే మార్కెట్‌లో లభించే కొన్ని రోస్టెడ్ నట్స్‌లో అదనపు నూనె, ఉప్పు కలుపుతారు. ఇవి కేలరీలను పెంచడంతోపాటు ఆరోగ్యపరంగా అంతగా మంచివి కావు. కాబట్టి కొనుగోలు చేసే సమయంలో డ్రై రోస్టెడ్, అన్‌సాల్టెడ్ అనే ఎంపికలను చూడటం అవసరం. భద్రత పరంగా కూడా కొంత తేడా ఉంది. ముడి నట్స్ వేడి చేయకపోవడం వల్ల కొద్దిగా బ్యాక్టీరియా కలుషితం అయ్యే అవకాశం ఉంటుంది. రోస్టింగ్ ప్రక్రియలో తేమ తగ్గి, సాల్మొనెల్లా వంటి హానికర బ్యాక్టీరియా నశిస్తాయి. అందువల్ల దీర్ఘకాల నిల్వ, ప్రయాణాల సమయంలో రోస్టెడ్ నట్స్ కొంత భద్రమైన ఎంపికగా భావించవచ్చు.

**ఏవి మంచివి..?**

మొత్తానికి, ఏది మంచిది అనేది వ్యక్తిగత అవసరాలపై ఆధారపడి ఉంటుంది. పోషకాలు గరిష్టంగా పొందాలని అనుకుంటే ముడి నట్స్ మంచివి. రుచి, సులభ జీర్ణం కావాలని భావిస్తే డ్రై రోస్టెడ్ నట్స్ కూడా మంచి ఎంపిక. ముఖ్యంగా ఉప్పు, నూనె, చక్కెర కలపని వాటిని ఎంచుకోవడం అత్యంత ముఖ్యం. చివరగా, ముడి నట్స్ గానీ, రోస్టెడ్ నట్స్ గానీ మితంగా తీసుకుంటే రెండూ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఒకదాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. సరైన పరిమాణంలో, సరైన విధంగా తీసుకుంటే ఇవి ఆరోగ్యకరమైన ఆహారంలో భాగమవుతాయని వైద్యులు సూచిస్తున్నారు.

# క్రీడలు



## సీఎస్కే ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్..
## మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి గాయం




స్పోర్ట్స్ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ప్రారంభానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్ కు ఊహించని షాక్ తగిలింది. ఆ జట్టు కీలక ఆటగాడు, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గాయం కారణంగా టోర్నీ మొదటి 2 వారాల పాటు ఆటకు దూరం కానున్నారు. ఈ విషయాన్ని సీఎస్కే ఫ్రాంచైజీ ఇవాళ అధికారికంగా ప్రకటించింది. ప్రాక్టీస్ సెషన్స్ సమయంలో ధోనీ పిక్క కండరాల గాయానికి గురైనట్లుగా సమాచారం. దీంతో ఆయన కనీసం 2 వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ధోనీ ఐపీఎల్ 2026 మొదటి 2వారాల మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చు. తాజాగా సోషల్ మీడియాలో 'గెట్ వెల్ సూన్ తలా' అంటూ సోషల్ మీడియా వేదికగా సీఎస్కే పోస్ట్ చేసింది.

## ఎస్ఆర్‌ఎచ్ అభిమానులకు గుడ్ న్యూస్..
## కెప్టెన్ 'కమిన్స్' రీ-ఎంట్రీపై బిగ్ అప్డేట్..!




స్పోర్ట్స్ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే సన్ రైజర్స్ హైదరాబాద్ (ా=ఽ) జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జట్టు కెప్టెన్ పాట్ కమిన్స్ గాయం కారణంగా సీజన్ మొదట్లో కొన్ని మ్యాచ్ లకు దూరం కానున్నాడు. దీంతో తాత్కాలికంగా జట్టు నాయకత్వ బాధ్యతలను ఇషాన్ కిషన్ కు అప్పగించినట్లు ఫ్రాంచైజీ తెలిపిన సంగతి విదితమే. నిజానికి మొదట కమిన్స్ సీజన్ మొదటి భాగం పూర్తిగా దూరమవుతాడని భావించినప్పటికీ, హెడ్ కోచ్ డేనియల్ వెటోరి తాజా సమాచారం ఇచ్చాడు. కమిన్స్ ఫిట్ గా ఉన్నాడని మరో 10 రోజుల్లో మైదానంలోకి తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

హెడ్ కోచ్ డేనియల్ వెటోరి ప్రకారం కమిన్స్ ఫిట్‌నెస్ విషయంలో ఎలాంటి సమస్య లేదు. అయితే దీర్ఘకాలంగా మ్యాచ్ లకు దూరంగా ఉండటం వల్ల బౌలింగ్ లోడ్ ను మళ్లీ పెంచుకోవడం ప్రధాన సమస్యగా మారిందని అన్నారు. మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా కూడా అతని ఫిట్‌నెస్ పై కన్నేసిందని ఆయన అన్నారు. గతంలో గాయాల కారణంగా యాషెస్ సిరీస్, టీ20 వరల్డ్ కప్ 2026కు దూరమైన కమిన్స్‌ను త్వరగా రిస్క్ తీసుకుని ఆడించబోమని ఆస్ట్రేలియా బోర్డు స్పష్టం చేసింది.

ఇదిలా ఉంటే, సన్ రైజర్స్ హైదరాబాద్ ( జట్టు కాంబినేషన్‌పై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని కోచ్ అన్నారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో స్థానిక ఆటగాళ్లు గట్టి పోటీ ఇస్తున్నారని.. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లలో స్మరణ్, సలీల్ లు అద్భుతంగా ఆడుతున్నారని పేర్కొన్నారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పాటు ప్రాక్టీస్ మ్యాచ్ లలో వీరి ప్రదర్శన బాగుండటంతో జట్టులో చోటు కోసం పోటీ పెరిగిందని అన్నారు.

ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఎదుర్కోనుంది. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న ఆర్సీబీకి ఎదురు నిలవాలంటే బౌలింగ్ కాంబినేషన్ కూడా సరిగా ఉండాలని వెటోరి అన్నారు. మొత్తంగా చూస్తే కమిన్స్ గైర్హాజరు ఎస్ఆర్‌హెచ్‌కు తాత్కాలిక ఇబ్బందిగా మారినా, అతను త్వరలోనే జట్టులో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అదే జరిగితే, ధోని రిటైర్మెంట్ ఇస్తాడు - అశ్విన్



స్పోర్ట్స్ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): ఐపీఎల్ ప్రారంభమైన నేపథ్యంలో ధోని రిటైర్మెంట్ పై రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ గురించి ఎవరు మాట్లాడకూడదని.. ధోనినే దానిపైన నిర్ణయం తీసుకుంటాడని వెల్లడించారు అశ్విన్. చెన్నై సూపర్ కింగ్స్ కు తన అవసరం లేదనుకుంటే డకౌట్ లో ధోని కూర్చుంటాడని ఏబీ డివిలియర్స్ వెల్లడించారు. అతని స్థానంలో మరో కుర్రాడికి ఛాన్స్ ఇస్తారని తెలిపారు.


అయితే ఏబీ డివిలియర్స్ చేసిన ఈ వ్యాఖ్యలపై అశ్విన్ కౌంటర్ ఇచ్చారు. చెన్నై సూపర్ కింగ్స్ కు తన సేవలు అవసరం లేదని ధోని భావిస్తే, స్వయంగా తానే రిటైర్మెంట్ ప్రకటిస్తాడని అశ్విన్ తెలిపారు. కానీ జట్టులోనే ఉండి కుర్ర క్రికెటర్లకు ఎలాంటి ఇబ్బంది కలిగించబోడని తెలిపారు. ఈ రిటైర్మెంట్ పైన ధోనినే నిర్ణయం తీసుకోవాలని.. ఎవరు కూడా అతనిపై ఒత్తిడి తేకూడదని సూచనలు చేశారు. అలాంటోడు జట్టులో ఉంటే 1000 ఏనుగుల బలమే అంటూ కితాబు ఇచ్చారు.

## హాకీ ఉత్తమ ప్లేయర్లుగా హార్దిక్, నవ్‌నీత్ కౌర్‌లకు అవార్డులు



స్పోర్ట్స్ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): 2025కు సంబంధించిన హాకీ ఇండియా వార్షిక అవార్డుల ప్రదానోత్సవం ఢిల్లీలో శుక్రవారం జరిగింది. ప్రతిష్టాత్మక బల్బీర్ సింగ్ సీనియర్ అవార్డు(ప్లేయర్ ఆఫ్ ది ఇయర్) పురుషుల విభాగంలో హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో నవ్‌నీత్ కౌర్‌లను వరించింది. హార్దిక్ ఉత్తమ ప్లేయర్ అవార్డు గెలవడం ఇది మూడోసారి కావడం విశేషం. ఇంతకుముందు 2022, 2023లలో అవార్డు దక్కింది. దిగ్గజ ప్లేయర్, ఒలింపిక్ మెడలిస్ట్ జాఫర్ ఇక్బాల్‌ను హాకీ ఇండియా మేజర్ ధ్యాన్‌చంద్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది. 1980 మాస్కో ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన భారత జట్టులో ఆయన సభ్యుడు. అలాగే, గోల్ కీపర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు బిచు దేవి ఖరిబమ్ సొంతమైంది. డిఫెండర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సంజయ్‌ను, మిడ్ ఫీల్డర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సుమిత్‌ను, ఫార్వార్డ్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సుఖ్‌జీత్ సింగ్‌లను వరించాయి. అండర్-21 పురుషుల, మహిళల విభాగాల్లో అప్‌కమింగ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు జుగ్‌రాజ్ సింగ్, సాక్షి రాణా గెలిచారు.

## అంతర్జాతీయ వేదికపై సత్తాచాటిన తెలంగాణ అమ్మాయి..
## ఆర్చరీలో గోల్డ్ మెడల్ కైవసం



స్పోర్ట్స్ న్యూస్, 28 మార్చి (క్రాంతి న్యూస్): తెలంగాణ ఆర్చర్ తానిపర్తి చికిత అంతర్జాతీయ వేదికపై సత్తాచాటింది. థాయిలాండ్‌లో జరిగిన ఆసియా కప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో రెండు పతకాలు గెలిచింది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజత్ చౌహాన్‌తో కలిసి గోల్డ్ మెడల్ సాధించింది. శుక్రవారం జరిగిన ఫైనల్‌లో చికిత జోడీ 158-156 తేడాతో మలేసియా జంటను ఓడించింది. నాలుగు సెట్లలో జరిగిన గేములో చికిత జంట మూడు సెట్లు నెగ్గి ఆధిపత్యం ప్రదర్శించింది. అలాగే, మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో రాజ్ కౌర్, తేజాల్ సాల్వేలతో కలిసి చికిత రజతం కైవసం చేసుకుంది. ఫైనల్‌లో భారత జట్టు 227-229తో కజకస్థాన్ చేతిలో ఓడి తృటిలో బంగారు పతకం చేజార్చుకుంది. గతేడాది చికిత వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్-21 వ్యక్తిగత కాంపౌండ్ కేటగిరీలో గోల్డ్ మెడల్ దక్కించుకుంది. ఈ ఘనత సాధించిన తొలి భారత ఆర్చరీగా నిలిచింది.

పురుషుల కాంపౌండ్ క్లీన్‌స్వీప్

పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ విభాగాన్ని భారత ఆర్చర్లు క్లీన్‌స్వీప్ చేశారు. ఉదయ్ కాంబోజ్ గోల్డ్ మెడల్ సాధించగా.. ప్రథమేశ్ సిల్వర్, రజత్ చౌహాన్ బ్రాంజ్ మెడల్స్ గెలిచారు. ఫైనల్‌లో ఉదయ్ 145-144తో ప్రథమేశ్‌పై నెగ్గాడు. బ్రాంజ్ మెడల్ మ్యాచ్‌లో రజత్ 145-144తో థాయిలాండ్ ప్లేయర్‌పై విజయం సాధించాడు. మహిళల రికర్వ్ ఫైనల్‌లో రిధి ఓడిపోయి రజతంతో సరిపెట్టింది. మహిళల కాంపౌండ్ కేటగిరీలో తేజాల్ సాల్వే రజతం దక్కించుకుంది. పురుషుల రికర్వ్ జట్టు రజతం, పురుషుల కాంపౌండ్, మహిళల రికర్వ్ జట్లు కాంస్య పతకాలు సాధించాయి. దీంతో ఈ టోర్నీలో భారత్ మొత్తం 10 పతకాలను కైవసం చేసుకుంది. అందులో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, 5 కాంస్య పతకాలు ఉన్నాయి.

KR TV క్రాంతి
ఆదివారం 29 మార్చి 2026
సినిమా న్యూస్
epaper.krtvnews.com

# రుక్మిణి వసంత్‌తో విభేదాలు

బాక్సాఫీస్ వద్ద శివతాండవం ఆడుతూ 850 కోట్లకు పైగా వసూళ్లతో ప్రభంజనం సృష్టించిన రిషబ్ శెట్టి, ఇప్పుడు తన సోషల్ మీడియా నిర్ణయాలతో ఇండస్ట్రీలో ఒక పెద్ద భూకంపమే సృష్టించారు. 'కాంతార: చాప్టర్ 1' సక్సెస్ ఎంజాయ్ చేయాల్సిన సమయంలో, తనను గ్లోబల్ స్టార్‌ను చేసిన నిర్మాణ సంస్థతో పాటు, తోటి నటీనటులను కూడా ఆయన అన్‌ఫాలో చేయడం ఇప్పుడు టాలీవుడ్, శాండల్‌వుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రిషబ్ శెట్టిని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను ఆయన అన్‌ఫాలో చేయడం అందరినీ షాక్‌కు గురిచేసింది. అయితే ఇందులో ఒక ట్విస్ట్ ఉంది. సంస్థ పేజీని అన్‌ఫాలో చేసిన రిషబ్, ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఫాలో అవుతున్నారు. అంటే, నిర్మాణ సంస్థతో ఏదో విషయంలో విభేదాలు వచ్చినా, బాస్‌తో మాత్రం సంబంధాలు బాగానే ఉన్నాయని అర్థమవుతోంది. బహుశా భవిష్యత్తు ప్రాజెక్టుల విషయంలో ఏవైనా మనస్పర్థలు వచ్చి ఉండవచ్చని టాక్.

కేవలం ప్రొడక్షన్ హౌస్‌నే కాకుండా, తన సినిమాలో హీరోయిన్‌గా నటించిన రుక్మిణి వసంత్, తన ప్రాణ స్నేహితుడు, నటుడు రాజ్ బి శెట్టిని కూడా రిషబ్ తన ఫాలోయింగ్ లిస్ట్ నుంచి తొలగించారు. ముఖ్యంగా రాజ్ బి శెట్టితో రిషబ్‌కు ఉన్నస్నేహ బంధం దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. ఇటీవల జరిగిన కొన్ని ఇంటర్వ్యూలలో కూడా ఒకరి గురించి ఒకరు ప్రస్తావించకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చుతోంది. ఈ విషయంపై సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. అసలు వీరి గొడవలకు కారణాలేంటో ఆరా తీస్తున్నారు. కాగా.. రిషబ్ శెట్టి ఇప్పుడు కేవలం కన్నడ స్టార్ మాత్రమే కాదు, పాన్ ఇండియా లెవల్లో బిజీ అయ్యారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'జై హనుమాన్' చిత్రంలో ఆయన నటిస్తున్నారు. ఈ క్రమంలో ఇతర భాషల చిత్రాలపై దృష్టి పెట్టడం, హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై సినిమాలు చేయకపోవడం వల్లే ఈ విభేదాలు మొదలయ్యాయని ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.






# అనంతపురంలో 'రణబాలి'

రీసెంట్‌గా పెళ్లి బంధంలోకి అడుగు పెట్టిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న.. మ్యారేజ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తూనే సినిమా షూటింగ్‌లో కూడా జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తుంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'రణబలి'. రాహుల్ సంక్రిత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. విజయ్ రణబాలిగా, రష్మిక జయమ్మ పాత్రల్లో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని టీ సిరీస్ సమర్పణలో ప్రెస్టేజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతుంది. ఈ క్రమంలోనే ఎంజాయ్మెంట్‌ను సైతం పక్కన పెట్టి ఈ జంట షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు తెలుస్తుంది. ప్రజెంట్ 'రణబాలి' చిత్రీకరణ తాజా షెడ్యూల్ ఈ రోజు అనంతపురంలో ప్రారంభమైంది. ఏప్రిల్ మొదటి వారం వరకు చిత్రీకరణ కొనసాగుతుండగా ఇందులో రష్మిక, విజయ్‌పై సీన్స్ షూట్ చేయనున్నారు చిత్ర బృందం. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. పెళ్లైన నెలకే షూటింగ్‌లో పాల్గొన్నారు అంటే మీ డెడికేషన్ సూపర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్.

# బాబాయ్ బ్లెస్సింగ్స్‌తో

## 'బరి'లోకి దిగిన వరుణ్ తేజ్!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రాన్ని పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో పట్టాలెక్కించారు. 'బరి' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. యదు వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వరుణ్ తేజ్ సోదరి నిహారిక కొణిదెల తన సొంత బ్యానర్ 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్'పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవ వేడుకకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి సందడి చేశారు.

తొలి సన్నివేశానికి ఆయనే క్లాప్ కొట్టి షూటింగ్‌ను అధికారికంగా ప్రారంభించారు. తమ బాబాయ్ చేతుల మీదుగా సినిమా ప్రారంభం కావడంతో వరుణ్ తేజ్, నిహారిక సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ పూజా కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని సమాచారం. నిహారిక నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నటించబోయే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.



# పీవీసీయూలో ధురంధర్ విలన్

బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా పుట్టిన రోజు సందర్భంగా టాలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ చేసిన ఆసక్తికర ట్వీట్ ఇప్పుడు ఫిలిం నగర్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. "నిజమైన ప్రతిభకు శబ్దం అవసరం లేదు.. అక్షయ్ ఖన్నా స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక క్లాస్‌గా ఉంటాయి" అని ప్రశాంత్ వర్మ కొనియాడారు. కేవలం శుభాకాంక్షలు తెలపడమే కాకుండా, తమ ఇద్దరి కలయికలో రాబోతున్న కొత్త కంటెంట్‌ను ప్రపంచానికి చూపించేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ప్రకటించి సంచలనం రేపారు. ఈ సందర్భంగా ఆయన చమ్మీఘ్రుఝ్రీఱ సెట్స్ నుంచి అక్షయ్ ఖన్నాకు సంబంధించిన ఒక పవర్‌ఫుల్ స్టిల్‌ను విడుదల చేశారు. ఈ మూవీలో అక్షయ్ ఖన్నా 'అసుర గురువు శుక్రాచార్య'గా ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు.



'హనుమాన్' సినిమాతో నేషనల్ లెవల్‌లో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఇప్పుడు తన 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా వరుస ప్రాజెక్టులను లైన్‌లో పెట్టారు. తాజా సమాచారం ప్రకారం, అక్షయ్ ఖన్నా ప్రశాంత్ వర్మ బ్యానర్‌లో రూపొందుతున్న మూడు కీలక చిత్రాల్లో భాగం కాబోతున్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇందులో శక్తివంతమైన ఫీమేల్ సెంట్రిక్ స్టోరీగా రూపుదిద్దుకుంటున్న మహాకాళి చిత్రం ఒకటి కాగా, అదిరిపోయే సూపర్ హీరో థీమ్‌తో తెరకెక్కుతున్న అధిర, జై హనుమాన్ చిత్రాలు ఉన్నాయి. రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తున్న మైథాలజీ యాక్షన్ డ్రామా జై హనుమాన్. ఈ మూడు సినిమాల్లో అక్షయ్ ఖన్నా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా విడుదల చేసిన ఫోటోలో అక్షయ్ ఖన్నా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తుండటం ఫ్యాన్స్‌ను థ్రిల్ చేస్తోంది.

'మహాకాళి' చిత్రం ఇప్పటికే 100 రోజుల చిత్రీకరణను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సినిమాకు సంబంధించి చివరిదైన 40 రోజుల సుదీర్ఘ షెడ్యూల్ నేడు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ చిత్రంలో శుక్రాచార్యుడిగా నటిస్తున్న అక్షయ్ ఖన్నా పాత్ర కథలో అత్యంత కీలకమైన మలుపుగా ఉండబోతోందని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి మల్టీ-స్టూడియో ఆధ్వర్యంలో భారీ స్థాయిలో విజువల్ ఎఫెక్ట్స్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మెగా సినిమాటిక్ వండర్ విడుదల తేదీని మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించనున్నారు. ప్రశాంత్ వర్మ పర్యవేక్షణలో, పూజా అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం పీవీసీయూ లో మొదటి ఫిమేల్ సూపర్ హీరో మూవీగా రాబోతోంది. భూమి శెట్టి టైటిల్ రోల్ పోషిస్తుండగా, అక్షయ్ ఖన్నా ఎంట్రీతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ తన పూర్తి దృష్టిని జై హనుమాన్ చిత్రంపై పెట్టారు. ఇందులో అక్షయ్ ఖన్నా పాత్ర ఉంటుందా, ఉంటే ఎలా ఉండబోతోంది? ఆయన విలన్‌గా కనిపిస్తారా లేదా ఏదైనా పవర్‌ఫుల్ రోల్ ప్లే చేస్తారా అన్నది సస్పెన్స్‌గా మారింది.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com